సంపుటి : 18 సంచిక : 114
Vol : 18 Issue : 114

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 28 జూన్ 2026
Warangal, Sunday 28 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00





WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
- హనుమకొండ
- కరీంనగర్
- భూపాలపల్లి
- పెద్దపల్లి/రామగుండం
- జనగామ
- మహబూబాబాద్
- హైదరాబాద్
- నిజామాబాద్

Cell : 9493019044
9618509859




# ఉగ్రముప్పు!?

## ఇంటెలిజెన్స్ అలర్ట్...


### దేవాలయాలే టార్గెట్ ప్రణాళికలు..?

నిఘా వర్గాలకు అందిన సమాచారం

**పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ :** ప్రశాంతంగా ఉన్న భారతావనిపై ఉగ్ర చూపు పడిందా? మరీ ముఖ్యంగా దైవ భూమిపైనే దాడుకుల ప్లాన్ చేస్తున్నారా? దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి భారీ ఉగ్ర ముప్పు పొంచి ఉందని ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు హెచ్చరికలు ఒక్కసారిగా ప్రకంపనలు రేపాయి. ఖలీస్థానీ ఉగ్రవాదులు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు సమాచారం అందించాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ, ఉత్తరాఖండ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ దాడులకు సంబంధించి ఒక ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. అందులో ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లోని ప్రధాన దేవాలయాలతో పాటు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, పోలీసు వ్యవస్థలను కూడా ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ నేతలను (మిగతా 2లో...)

# తెలంగాణ సర్కార్‌కు ట్రంప్ థ్యాంక్స్

### నాకు దక్కిన అపూర్వ గౌరవం ఇది ▸▸ నెట్టింట ట్రంప్ ఇంట్రెస్టింగ్ పోస్ట్



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న మెయిన్ రోడ్డుకు డొనాల్డ్ ట్రంప్ అవెన్యూగా నామకరణం చేస్తూ ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అమెరికా రాయబారి సెర్గియో గోర్ కలిసి ఇటీవల.. డొనాల్డ్ ట్రంప్ అవెన్యూను ప్రారంభించారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా.. తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ఈ వ్యవహారంపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్ వేదికగా స్పందించారు.

హైదరాబాద్‌లోని ఒక రోడ్డుకు తన పేరు పెట్టడంపై రాష్ట్ర ప్రభుత్వానికి డొనాల్డ్ ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు. భారత్‌లోని (మిగతా 2లో...)

# ఉప్పల్ బాలుకు ఫారెస్ట్ అధికారుల షాక్

### వ్యూస్ కోసం అడవిలో వెర్రి వేషాలు.. ■ కారుపై స్టంట్స్ చేసినందుకు కేసు

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** సామాజిక మాధ్యమాల్లో లైకులు, వ్యూస్ కోసం కొందరు సోషల్ మీడియా తారలు ఎంతటి ప్రమాదకరమైన పనులకైనా తెగిస్తున్నారు. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో తన వింత డ్యాన్సులతో ఫేమస్ అయిన ఉప్పల్ బాలు తాజాగా చేసిన తిక్క పని తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, ప్రముఖ పర్యాటక ప్రాంతమైన వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి ఘాట్ రోడ్డులో ఉప్పల్ బాలు చేసిన వింత చేష్టలు, ప్రమాదకర స్టంట్లు సామాజిక మాధ్యమాలలో విపరీతమైన చర్చకు దారితీశాయి. దట్టమైన అటవీ ప్రాంత రహదారులపై వేగంగా వెళ్తున్న ఒక మహీంద్రా థార్ కారు బోనెట్, టాప్‌పై కూర్చొని ఉప్పల్ బాలు ప్రమాదకరమైన రీతిలో విన్యాసాలు చేస్తూ రీల్స్ వీడియోలు చేశాడు. ఈ వీడియోలు కాస్తా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వేదికలపై విపరీతంగా వైరల్ కావడంతో స్థానికులు, అనంతగిరి పద్మనాభ స్వామి దేవాలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

(మిగతా 2లో...)




# రేల రాకాసులపల్లిగా మారిన రేలకాయలపల్లి

- సీతారాం ప్రాజెక్టు భూముల్లో భారీ కుంభకోణం!
- గవర్నమెంట్ సొమ్ము గద్దలపాలు..
- నౌకరీ ఇనాం భూమి సైతం కబ్జాలు!
- అధికారులపై ఆయుధాలతో దాడులు..
- ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్న సిబ్బంది!
- పోలీసులకు ఫిర్యాదు చేసిన సంబంధిత అధికారులు.
- మావి మాత్రం ప్రాణాలు కావా అంటున్న అధికారులు.
- అవార్డు పొందిన మొక్కలను సైతం మళ్లీ నరికించి అమ్ముకుంటున్న కబ్జాదారులు

సింగరేణి (చీమలపాడు)-పీపుల్స్ డైరీ : అది ప్రభుత్వ రికార్డుల్లో రేలకాయలపల్లి.. కానీ అక్కడ జరుగుతున్న భూ అక్రమాలు, కబ్జాలు చూస్తుంటే అది కాస్తా 'రేల భూ రాకాసులపల్లి'గా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కబ్జాకోరుల ఆకలికి ప్రభుత్వ సొమ్ము గద్దలపాలవుతోంది. అర్హులైన పేదలకు చెందాల్సిన భూములు, ప్రభుత్వానికి చెందాల్సిన నష్టపరిహారం ఇక్కడ అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. నౌకరి ఇనాం భూములపై కబ్జా కోరలు చాచడం ఇక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.

**సీతారాం ప్రాజెక్టు పరిహారంలో భారీ దగా!**

ప్రతిష్టాత్మక సీతారాం ప్రాజెక్టు కింద పోయిన భూములకు సంబంధించి ఇక్కడ ఒక భారీ స్కామ్ వెలుగుచూసింది. కబ్జా చేసిన భూములను తమవిగా చూపిస్తూ కొందరు ఘనులు ప్రభుత్వ అవార్డులు (పరిహారం) పొందినట్లు తెలుస్తోంది. భూమి పరిహారమే కాకుండా, అక్కడ ఉన్న చెట్టుకు, పుట్టకు కూడా లెక్కలు కట్టి మరీ ప్రభుత్వం నుంచి పైసలు గుంజిన వైనం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. అంతటితో ఆగకుండా, ప్రభుత్వం నుంచి అవార్డు (మిగతా 2లో...)

## నడకయాతన!



# కష్టాల బాటలో చదువు

- విద్య కోసం చిన్నారుల పోరాటం ▸▸ బడికి పోవాలంటే నడకే దిక్కు
- సొంత గ్రామాలకు దూరంగా ఉన్నత పాఠశాలలు
- సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన 'పీపుల్స్‌డైరీ'
- సైకిళ్లు అందిస్తామని కలెక్టర్ హామీ

2వ పేజీలో..

అందరికీ బస్సుల దారి... వారికేమో కాలినడకే దారి... అందరికీ వ్యాన్ల సౌకర్యం... వారికేమో చెప్పులు అరిగే ప్రయాణం... వేకువ వెలుగుకంటే ముందే పుస్తకాల సంచిని భుజానేసుకుని, ఆకలి కడుపుతో అడుగులు వేస్తూ అక్షరాల కోసం నడిచే చిన్నారులు... ఎండైనా... వానైనా... విద్య కోసం ఆగని పాదయాత్ర... ఒక వైపు ప్రైవేట్ వ్యాన్లు ఇంటి ముందుకే చేరుతుంటే... మరో వైపు ప్రభుత్వ బడి పిల్లలు చమటోడుస్తున్నారు... కాళ్ళు నొప్పించినా... కలలు మాత్రం అలసిపోవు... చెమట చుక్కలు రాలినా... చదువు మీద ఆశ మాత్రం వాడిపోదు... మరి వీరి కష్టాలు పాలకులకు కనిపించేనా..?

*- రేగొండ జూన్ 27 (పీపుల్స్ డైరీ)*

# భారీ వర్ష సూచన...

### వారం పాటు కురిసే చాన్స్ ▸▸ ఉక్కపోత నుంచి ఉపశమనం

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : నైరుతి రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించి చాలా రోజులు అవుతున్నా ఆ స్థాయిలో మాత్రం వర్షాలు పడటం లేదు. ఫలితంగా ఎండ, ఉక్కపోత, వేడి అలాగే ఉన్నాయి. అయితే నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా విస్తరిస్తుండటంతో వర్షాలు పడటం లేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. నైరుతి రుతుపవనాల ఎఫెక్ట్‌తో రాష్ట్రంలో 7 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తాజాగా ఒక ప్రకటనలో వెల్లడించింది. మరీ ముఖ్యంగా ఉత్తర,



తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వానలు పడే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక.. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ నేపథ్యంలోనే ఆ రెండు ఉమ్మడి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, జనగాం, ములుగు.. నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, కుమురం భీమ్ ఆసిఫాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మంచిర్యాల, రంగారెడ్డి, సంగారెడ్డి, వరంగల్, (మిగతా 2లో...)

# వింత ఫిర్యాదు

- వాట్సాప్ గ్రూపు నుంచి తొలగించారని వేదన
- తిరిగి చేర్చుకోవట్లేదని పోలీసులకు ఫిర్యాదు
- పరిష్కారం కోసం తలలు పట్టుకుం టున్న పోలీసులు
- చర్చనీయాంశమైన ఘటన...

**పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ :** సాధారణంగా పోలీస్ స్టేషన్లలో దొంగతనాలు, హత్యలు, మానభంగాలు, ఇతర నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను మనం చూస్తుంటాం. అందుకు భిన్నంగా సోషల్ మీడియా పెరిగిన తర్వాత పోలీసులకు సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. తాజాగా హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఒక వింత కేసు నమోదైంది. కేవలం వాట్సాప్ గ్రూప్ నుంచి తనను తొలగించారనే కారణంతో.. తనను మళ్లీ ఆ గ్రూప్‌లో యాడ్ చేయించాలంటూ ఒక మహిళ ఏకంగా పోలీసులనే ఆశ్రయించిన ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఈ వింత వివాదానికి సంబంధించిన వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 పరిధిలోని ఎన్‌బీటీ నగర్ నివాసితుల కోసం స్థానికంగా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటైంది. ఆయా ప్రాంతాల్లో (మిగతా 2లో...)

# కష్టాల బాటలో చదువు...



**రేగొండ జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** అందరూ బస్సుల్లో వెళ్తుంటే, వారు కాలి నడకన వెళ్తున్నారు. తోటి విద్యార్థులు వ్యాన్లలో పోతుంటే వారికి కాలి నడకే దిక్కు. ఇదీ రేగొండ మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో బాలల పరిస్థితి. సొంత గ్రామాలకు దూరంగా ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిని చేరుకోవడానికి బస్సులు, ఆటోలు, లేవు. కొన్నిచోట్ల ఉన్నప్పటికీ అవి సమయానికి రావు. దీంతో నిత్యం విద్యాలయాలకు వెళ్లేందుకు పేద విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. ఈ సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు.

**నడిచి వెళ్లల్సిందే :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని ఉన్నత పాఠశాలకు విద్యార్థులు సుదూరం నుంచి నడిచి వస్తున్నారు. మండల కేంద్రానికి ముడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెంచుపల్లి, రావులపల్లి, గ్రామాల నుంచి విద్యార్థులు కాలినడకన వస్తున్నారు. స్థోమత ఉన్న వారు సైకిళ్లు, ఆటోల్లో వచ్చి పోతున్నారు. 70 మంది వరకు ఉన్న ఆ పాఠశాలలో 40 మంది మాత్రమే రేగొండ మండల కేంద్రానికి చెందిన వారు. మిగిలిన వారు ఇతర ఊర్ల నుంచి వస్తున్న వారే. రోజూ నాలుగైదు కి.మీటర్ల నుంచి చిన్నారులు పాదయాత్ర చేస్తున్నారు.

**అవస్థలు తప్పవు :** రేగొండ మండలంలోని రేగొండ, రంగయ్య పల్లి, రేపాక, మడత పల్లి, కోటంచ, భగీర్తి పేట, గోరికొత్తపల్లి మండలంలోని చిన్నకోడేపాక, గోరికొత్త పల్లి, జగ్గయ్యపేట, నిజాంపల్లి, గ్రామల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆయా జిల్లా పరిషత్ పాఠశాల పరిధి గ్రామాల నుంచి తదితర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యాలు ఉన్నాయి మారి కొన్ని గ్రామాలకు బస్సు వసతి లేక వీరు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. చెంచు పల్లి విద్యార్థుల పరిస్థితి దారుణం ముడు కిలోమీటర్లు దూరం నుండి నడక దారిలో నడచి రావాలి, మిగత ఉన్నత పాఠశాల విద్యార్థులదీ ఇదే పరిస్థితి.

**ఆటోలే శరణ్యం :** రేగొండ మండలంలోనీ గుడేపల్లి, భగీర్తిపేట, దుంపిల్లా పల్లి, పంచాయతీలకు బస్సు సౌకర్యం లేదు. ఆయా పంచాయతీల్లోని 8, 9, 10 విద్యార్థులు ప్రతిరోజూ ఆయా గ్రామాల పరిధిలోని హైస్కూల్‌కు రావాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్ విద్యార్థులు పరకాల, హన్మకొండ, భూపాలపల్లి, లోని జూనియర్ కళాశాలకు రావాలి. నిత్యం ఆయా గ్రామాల నుంచి 50 మంది వరకు ఆటోల్లో రాకపోకలు చేయాల్సి వస్తోంది. మండలంలోని భగీర్తి పేట, గుడేపల్లి, పంచాయతీల పిల్లలు ఆటోలు, ఇతర వాహనాల్లో రాకపోకలు చేస్తున్నారు. కాగా కాలి నడకన వచ్చే విద్యార్థులు నడకకు బయపడి ప్రయివేట్ పాఠశాలలో చేరుతున్నారు, ప్రయివేట్ పాఠశాలలకు చెందిన యాజమాన్యం ఇంటి ముందుకే స్కూల్ వ్యాన్ పంపిస్తూ విద్యార్థులను తీసుకువెళుతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు హాస్టల్ లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వం సూదురా ప్రాంత విద్యార్థులకు రవాణా సౌకర్యాలు కల్పిస్తే ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉండకపోదు..

**విద్యార్థుల సమస్యపై పీపుల్స్ డైరీ దృష్టి**

శనివారం రేగొండ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 'పీపుల్స్ డైరీ' రిపోర్టర్ కలెక్టర్ దృష్టికి విద్యార్థుల నడక సమస్య వివరించారు. విద్యార్థుల చదువుకోసం సుధూర ప్రాంతాలనుంచి వస్తున్నారని వారికి రవాణా సౌకర్యాలు కల్పించాలని 'పీపుల్స్ డైరీ' విలేకరి కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా మండలంలో జిల్లా పరిషత్ పాఠశాలకు ఎంత మంది కాలినడకన వస్తున్నారో నివేదిక అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో వారికి సైకిల్స్ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.. విద్యార్థుల సమస్యలు కలెక్టర్ ధ్రుష్టికి తీసుకుపోయిన పీపుల్స్‌డైరీ పత్రికకు అధికారులు అభినందనలు తెలిపారు.





# 'రేల రాకాసులపల్లి'గా మారిన రేలకాయలపల్లి..

(మొదటి పేజీ తరువాయి)

పొందిన సుబాబుల్ మొక్కలను సైతం సదరు భూ కబ్జాదారులే మళ్లీ నరికించి, మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంటే... ఒకే భూమిపై అటు ప్రభుత్వ పరిహారం, ఇటు చెట్ల అమ్మకం ద్వారా డబుల్ లాభాలు అర్జిస్తూ ప్రభుత్వ ఖజానాకు కన్నం వేశారు.

**అధికారులపై ఆయుధాలతో దాడి.. పోలీసుల ఉదాసీనత!**

ఈ అక్రమాలను అడ్డుకునేందుకు క్షేత్రస్థాయికి వెళ్లిన ప్రభుత్వ అధికారులకు కబ్జాదారుల నుంచి ఘోర పరాభవం ఎదురైంది. అక్రమాలను ఆపడానికి వెళ్లిన అధికారులపై కబ్జాదారులు ఆయుధాలతో ప్రాణాంతక దాడికి తెగబడ్డారు. ఈ దాడితో షాక్‌కు గురైన అధికారులు... "మాకు ఉద్యోగం కంటే మా ప్రాణాలే ముఖ్యం" అంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అయితే, ఈ దాడి ఘటనపై సదరు అధికారులు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ, ఖాకీలు పట్టించుకోలేదని, కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. పోలీసుల ఉదాసీనత కబ్జాదారులకు మరింత బలాన్ని ఇచ్చినట్లయింది.

**మంత్రిగారు, ఉన్నతాధికారులు స్పందించాలి!**

భూములు కోల్పోయి రోడ్డున పడ్డ అసలైన భూపట్టాదారులు, ప్రాణభయంతో విధులు నిర్వహించలేకపోతున్న సంబంధిత ప్రభుత్వ అధికారులు ఇప్పుడు ఉన్నతాధికారుల వైపు, ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నారు.

**బాధితుల డిమాండ్**

"ఈ భూ కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలి. ప్రభుత్వ సొమ్మును దోచుకున్న కబ్జాదారులపై, అధికారులపై దాడులకు తెగబడ్డ రౌడీలపై కఠిన చర్యలు తీసుకోవాలి. సంబంధిత శాఖ మంత్రిగారు, ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి మాకు న్యాయం చేయాలి వాపోతున్నారు.

# తహసీల్దార్ పై వస్తున్న ఆరోపణలు అవాస్తవం



**పీపుల్స్ డైరీ-**వరంగల్ : ఖిల్లా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ పై వస్తున్న తప్పుడు వార్తలను ఖండిస్తూ భూ యజమాని విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు తిమ్మాపూర్ గ్రామ శివారులోని సర్వేనంబర్ 188/8 లో ఎకరం 20 గుంటలు భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని భూమికి సంబంధించిన వాస్తవ వివరాలు వారు వెల్లడించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిమ్మాపూర్ గ్రామ శివారులోని సర్వే నం. 188/8 మొత్తం విస్తీర్ణం 1 ఎకరం 20 గుంటలు ఈ భూమిలో 38 గుంటలు అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో ఉన్నట్టు అర్బన్ ల్యాండ్ సీలింగ్ ఫైల్ నంబర్ 34/3742/76 పరిశీలించిన అనంతరం 2004 లో ప్రత్యేక అధికారి వరంగల్ ఈ భూమి అర్బన్ ల్యాండ్ సీలింగ్ పరిధిలో లేదని పట్టా భూమి అని స్పష్టంగా ధృవీకరిస్తూ సర్టిఫికేట్ జారీ చేశారన్నారు సర్టిఫికేట్ ఆధారంగా అప్పటి తహసీల్దారు నాగేంద్ర ఖాతా నంబర్ 323 ప్రకారం కేడల వీరన్న పేర పట్టాదార్ పాస్ పుస్తకం జారీ చేశారని సంబంధిత పత్రం 1-బి రిజిస్టర్ లో సైతం నమోదు అయ్యాయన్నారు శేత్వార్, ఖాస్ర పహాణి తదితర రెవెన్యూ రికార్డులలో సైతం భూమి ఎక్కడా సీలింగ్ భూమిగా నమోదు కాలేదని కేడల వీరన్న నుండి గణపతి ఎడ్యుకేషన్ సొసైటీ పేర రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా 38 గుంటలు కొనుగోలు చేసిందన్నారు కోలపాక రాజయ్య, నాగబోయిన మల్లేశం కూడా 2001 వ సంవత్సరంలో భూమిని కొనుగోలు చేశారని మొత్తం కలిపి 1 ఎకరం 20 గుంటలు గణపతి ఎడ్యుకేషన్ సొసైటీ పేర నమోదయ్యాయని పేర్కొన్నారు ఈ పత్రాలు సైతం 1-బి రిజిస్టర్లో పొందు పరిచినట్టు వారు తెలిపారు 16-11-2017 అప్పటి తహసీల్దారు డిజిటల్ సంతకం చేశారని అనంతరం కారణం తెలియకుండా కొంతమంది రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం,తప్పిదం వల్ల డిజిటల్ సంతకం తొలగించబడి పెండింగ్ లో చూపెడుతుందన్నారు

నేను సంబంధిత భూమిని యజమానుల నుండి చట్టబద్ధంగా కొనుగోలు చేసి అడ్వాన్స్ కూడా చెల్లించానని రెండు సంవత్సరాల పాటు డిజిటల్ సంతకం కోసం ప్రయత్నించినా పరిష్కారం కాలేదన్నారు ప్రస్తుత తహసీల్దారు ఇక్బాల్ దరఖాస్తు చేయగా ఆయన పూర్తి స్థల పరిశీలన అనంతరం అన్ని రికార్డులను పరిశీలించి ఇది పట్టా భూమేనని సీలింగ్ రికార్డులు లేవని నిర్ధారించి డిజిటల్ సంతకం పూర్తి చేశారన్నారు డిజిటల్ సంతకం అనంతరం కుటుంబ అవసరాల దృష్ట్యా ఈ భూమిలో కొంత భాగాన్ని ఇతరులకు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ ద్వారా విక్రయించడం జరిగిందన్నారు రిజిస్ట్రేషన్ సమయంలో కూడా అన్ని చట్టపరమైన నిబంధనలు పాటించామని తెలిపారు కొంతమంది ఈ భూమిని సీలింగ్ భూమిగా, అవినీతి సంబంధిత భూమిగా ప్రచారం చేయడం పూర్తిగా నిరాధారమని యుఎల్సి నంబర్ 34/3742/76, స్పెషల్ ఆఫీసర్ జారీ చేసిన సర్టిఫికేట్ సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు స్పష్టమవుతాయని వారు విలేకరుల సమావేశంలో తెలిపారు తిరిగి భూమి విక్రయానికి ఎలాంటి అడ్డంకులు రాకుండా సంబంధిత అధికారులు అసలు రికార్డులను పరిశీలించి, వాస్తవాలను ప్రజలకు తెలియజేసి, జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆపాలని వారు వేడుకున్నారు

# గొల్లగూడెంలో ఓటరు నమోదు మహాయజ్ఞం

- **ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఇంటింటికి ఓటరు నమోదు ఫారాల పంపిణీ**
- **18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు ఓటరుగా నమోదు కావాలి**
- **ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఓటు అమూల్యం**
- **బి ఎల్ ఓ ఎండి జుబేదా**

సైదాపూర్ జూన్ 27 ( పీపుల్స్ డైరీ) :

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని గొల్లగూడెం గ్రామ ఉప సర్పంచ్ ఉప సర్పంచుల రాష్ట్ర ఉపాధ్యక్షులు దుస్స కుమార్ పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గొల్లగూడెం గ్రామంలోని 191వ బూత్ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన పొందారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణలు చేపడుతున్నట్లు నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చల్లూరి రాజయ్య మాజీ జెడ్పిటిసి గుండారపు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ, 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత శక్తివంతమైన ఆయుధమని, గ్రామంలో ఒక్క అర్హుడైనా ఓటరు జాబితాకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్ఓ) మహమ్మద్ జుబేదా మాట్లాడుతూ, ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారం-8 ద్వారా సవరణలు, ఇతర అవసరమైన మార్పులు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు సరైన ఆధార పత్రాలతో ముందుకు వచ్చి నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు ఫారాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఎన్నికల అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా స్వచ్ఛత, పారదర్శకత కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బత్తుల కొమురయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య, మండల కొమురయ్య, వార్డు సభ్యులు మహేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బత్తుల సంపత్ మహేష్, ప్రేమ్ కుమార్, నాయకులు రుద్రారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా స్పందిస్తూ ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని నాయకులు కోరారు.



# ఉప్పల్ బాలుకు ఫారెస్ట్ అధికారుల షాక్

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో పవిత్రమైన, ప్రశాంతమైన పుణ్యక్షేత్ర వాతావరణాన్ని ఇలాంటి వెర్రి చేష్టలతో అప్రతిష్టపాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఘాట్ రోడ్డులో ప్రయాణించే ఇతర వాహనదారుల భద్రతను సైతం ప్రమాదంలో పడేస్తూ.. అటవీ శాఖ నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘించిన ఉప్పల్ బాలు, అతని మిత్రులపై తక్షణమే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు, స్థానికులు డిమాండ్ చేశారు.

ఈ వివాదాస్పద వ్యవహారంపై వికారాబాద్ అటవీ శాఖ అధికారులు వేగంగా స్పందించారు. వన్యప్రాణుల రక్షణ, అభయారణ్య పరిధిలోకి వచ్చే అనంతగిరి కొండల ప్రాంతంలో ఇలాంటి ప్రమాదకరమైన, శబ్ద కాలుష్యంతో కూడిన విన్యాసాలు చేయడం వన్యప్రాణుల చట్టాల ప్రకారం పూర్తిగా చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినందుకు గానూ ఉప్పల్ బాలుపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేసినట్లు ప్రకటించారు.

# ఉగ్రముప్పు?

(మొదటి పేజీ తరువాయి)

కూడా టార్గెట్ చేస్తున్నట్లు ఆ ఈ-మెయిల్ సమాచారం ఇస్తోంది. ఈ మెయిల్ నిజానిజాలను నిర్ధారించేందుకు, దాని మూలాలను కనుగొనేందుకు ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తాజా హెచ్చరికలతో ఢిల్లీ, ఉత్తరాఖండ్ పోలీసులు, నిఘా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. ముఖ్యంగా సెన్సిటివ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించి, కట్టుదిట్టం చేస్తున్నారు. నిఘా సంస్థలు గతంలో కూడా ఇదే తరహా హెచ్చరికలు జారీ చేశాయి.

జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిషేధిత ఖలీస్థానీ గ్రూపులు, బంగ్లాదేశ్ ఆధారిత ఉగ్రవాద సంస్థల నుండి దాడుల ముప్పు ఉందని హెచ్చరించగా, ఫిబ్రవరి నెలలో ఎర్రకోట సమీపంలో, చాందినీ చౌక్ ప్రాంతంలోని దేవాలయాలపై ఉగ్రవాదులు దాడి చేసే అవకాశం ఉందని నిఘా వర్గాలు వెల్లడించాయి. ఎర్రకోట, చాందినీ చౌక్ వంటి కీలక మతపరమైన ప్రదేశాలు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ రాడార్‌లో ఉన్నాయని నిఘా వర్గాలు గతంలోనే పేర్కొన్నాయి.

# తెలంగాణ సర్కార్‌కు ట్రంప్ కృతజ్ఞతలు..

(మొదటి పేజీ తరువాయి)

హై దరా బాద్‌లో కొత్తగా డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ ఏర్పాటు అయిందని.. ఈ రకమైన గౌరవం దక్కించుకున్న తొలి అమెరికా అధ్యక్షుడిని తానే అని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే థాంక్యూ అని ట్రంప్ రాసుకొచ్చారు.

అమెరికా 250వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా.. ఈ నెల 23వ తేదీన అమెరికా కాన్సులేట్ రోడ్డుకు ట్రంప్ అవెన్యూగా పేరు పెట్టారు. ఈ క్రమంలోనే శిలాఫలకాన్ని సెర్గియో గోర్, భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమెరికా, భారత్ మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలు చాలా బలమైంది అంటూ ఇద్దరు నేతలు వెల్లడించారు.

ఈ క్రమంలోనే కేవలం అమెరికా కాన్సులేట్ రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టడం మాత్రమే కాదని.. ఇక నుంచి మరిన్ని ఇలాంటి నిర్ణయాలు ఉంటాయని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. గ్లోబల్ ఐటీ హబ్‌గా దూసుకెళ్తున్న హైదరాబాద్ నగరంలో ఉన్న మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీల కార్యాలయాలకు అతి సమీపంలోనే ఈ డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ ఉండటం విశేషం. ఇది వ్యాపారపరంగా, వ్యూహాత్మకంగా ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయంగా మరింత పెంచడమే కాకుండా.. భవిష్యత్తులో మరిన్ని అమెరికన్ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

# భారీ వర్ష సూచన...

(మొదటి పేజీ తరువాయి)

యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని తెలిపింది.



ఈ క్రమంలోనే గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వర్షాలు, గాలుల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు.. రాష్ట్రవ్యాప్తంగా ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. ఇక.. మరోవైపు.. హైదరాబాద్‌లో వాతావరణం చల్లబడింది. దీంతో నిన్న మొన్నటి వరకు వేడి, ఉక్కపోతతో ఇబ్బంది పడిన ప్రజలు సేద తీరుతున్నారు. ఈ క్రమంలోనే లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండే చోట, ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉండటంతో ప్రజలు అత్యవసరం అయితే బయటికి రావాలని.. ముందుగానే ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జూలై 2వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. ఉత్తర, మధ్య, తూర్పు తెలంగాణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఒకట్రెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని.. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

# అప్పులు తీర్చేందుకు భూమి విక్రయం చేస్తున్నా

**ఆరోపణలు నిరాధారము : దూకిరే అంబాజీ**



**హుజూరాబాద్, జూన్ 27 (పీపుల్స్ డైలీ) :** ఇటీవల హుజూరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ సందర్భంగా చోటుచేసుకున్న మహిళ ఆత్మహత్యాయత్నం ఘటనకు సంబంధించి తమపై, అధికారులపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమని భూ విక్రయదారుడు దూకిరే అంబాజీ పేర్కొన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన భూమిని వ్యక్తిగత అవసరాలు, అప్పులు తీర్చుకోవడం కోసం విక్రయిస్తున్నానని తెలిపారు. తన భూమిని కాజేయాలనే ఉద్దేశంతోనే రాజ్‌కమల్ మరియు ఆయన తల్లి పద్మ తహసీల్దార్ కార్యాలయంలో ఆత్మహత్యాయత్నం పేరుతో నాటకం చేశారని ఆరోపించారు. తనకు తోబుట్టువులు ఎవరూ లేరని, భూమిని విక్రయించే హక్కు పూర్తిగా తనకే ఉందని స్పష్టం చేశారు. గతంలో రాజ్‌కమల్ మూడు గుంటల భూమిని కొనుగోలు చేస్తానని చెప్పి పాస్‌పుస్తకం తీసుకెళ్లి తిరిగి ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయమై ఇప్పటికే పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భూమి కొనుగోలు వ్యవహారంలో రాజ్‌కమల్‌కు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్న అంబాజీ, ఈ అంశంపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ భూ వివాదానికి సంబంధించి ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా, ఘటనపై సంబంధిత అధికారులు మరియు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అధికారిక విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# వింత ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న స్థానిక బస్తీ సమస్యలు, పారిశుధ్యం, తాగునీరు వంటి మౌలిక వసతులపై చర్చించుకోవడానికి, కాలనీవాసులను సమన్వయం చేయడానికి ఈ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. అయితే గత కొంతకాలంగా ఈ గ్రూప్‌లో కొందరు సభ్యులు స్థానిక సమస్యలను పక్కనబెట్టి రాజకీయాలకు సంబంధించిన మెసేజ్‌లు, పోస్టులను షేర్ చేయడం ప్రారంభించారు. దీనిపై గ్రూప్ అడ్మిన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. గ్రూప్‌లో ఎలాంటి రాజకీయ ప్రచారాలు, పోస్టులు పెట్టవద్దని కేవలం బస్తీ సమస్యలపైనే మాట్లాడాలని సభ్యులందరికీ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు.

అయినప్పటికీ, సదరు మహిళ గ్రూప్ నియమాలను ఉల్లంఘిస్తూ వరుసగా రాజకీయ సందేశాలను పోస్ట్ చేస్తూనే వచ్చింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రూప్ అడ్మిన్ ఆమెను ఆ వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించారు. గ్రూప్ నుంచి తొలగించిన తర్వాత ఆ మహిళ పలుమార్లు గ్రూప్ అడ్మిన్‌ను సంప్రదించి తనను మళ్లీ గ్రూప్‌లో యాడ్ చేయాలని కోరింది. అయితే అడ్మిన్ అందుకు నిరాకరించడంతో ఆమె దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తనను గ్రూప్‌లో చేర్చుకోకుండా అడ్మిన్ తనను మానసిక వేధింపులకు గురిచేస్తున్నాడంటూ నేరుగా బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది.

మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసు విషయమై గ్రూప్ అడ్మిన్‌ను పిలిపించి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన గ్రూప్ అడ్మిన్ తన నిర్ణయానికి కట్టుబడి ఉన్నట్లు పోలీసుల సమక్షంలోనే తేల్చి చెప్పారు. గ్రూప్ నిబంధనలను పదే పదే ఉల్లంఘించినందువల్లే ఆమెపై చర్య తీసుకున్నామని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమెను తిరిగి ఆ వాట్సాప్ గ్రూప్‌లో చేర్చుకునే ప్రసక్తే లేదని పోలీసుల ముందే స్పష్టం చేశారు. కేవలం వాట్సాప్ గ్రూప్ లొల్లి పోలీసు స్టేషన్ వరకు వెళ్లడం, అడ్మిన్ మొండిగా నిరాకరించడంతో ఈ వింత కేసును ఎలా పరిష్కరించాలా? అని బంజారాహిల్స్ పోలీసులు తలపట్టుకున్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
ఆదివారం, 28 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 114


# నేడే 'జాతీయ బీమా అవగాహన దినోత్సవం'

### పల్లె నుండి పట్నం దాకా ప్రతి గుండెకూ ఆర్థిక భరోసా 'బీమా'

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. నిశ్శబ్దంగా, ప్రశాంతంగా సాగిపోయే జీవితంలోకి 'అనిశ్చితి' అనే తుఫాను ఎప్పుడు ఏ రూపంలో ముంచెత్తుతుందో ఏ శక్తీ ఊహించలేదు. రాత్రికి రాత్రే సంభవించే ఒక రోడ్డు ప్రమాదమో, అకస్మాత్తుగా గుండె తలుపు తట్టే భయంకర అనారోగ్యమో, లేదా ప్రకృతి సృష్టించే ప్రళయమో... ఒక మధ్యతరగతి లేదా సామాన్య కుటుంబపు దశాబ్దాల కష్టాన్ని, కలలను క్షణాల్లో బూడిద చేయగలవు. సంపాదనపై ఉన్న శ్రద్ధ, ఆ సంపాదనకు ఒక 'సురక్షిత రక్షణ వలయం' ఏర్పాటు చేసుకోవడంపై లేకపోవడమే నేటి ఆధునిక సమాజంలో కనిపిస్తున్న అతిపెద్ద మేధోపరమైన వైఫల్యం. రేపు (జూన్ 28) దేశవ్యాప్తంగా 'జాతీయ బీమా అవగాహన దినోత్సవం' జరగనున్న నేపథ్యంలో, అసలు ఏ రకమైన బీమా పాలసీలను ఎంచుకోవాలి? ఏది మన కుటుంబానికి శ్రీరామరక్షగా నిలుస్తుంది? అనే అంశాలపై ప్రత్యేక, లోతైన పరిశోధనాత్మక విశ్లేషణ.

**బీమా అంటే ఖర్చు కాదు... ముందస్తు వ్యూహం!**

మనదేశంలో బీమా (ఇన్సూరెన్స్) అనగానే చాలామంది 'అదొక అదనపు వృథా ఖర్చు' లేదా 'చనిపోతే వచ్చే డబ్బులు' అనే సంకుచిత భావనతోనే ఉండిపోతున్నారు. జీవిత బీమాను కేవలం ఆదాయపు పన్ను (ఇన్‌కమ్ టాక్స్) ఆదా చేసుకునే ఒక తాత్కాలిక సాధనంగానే చూసే దుస్థితి మారాలి. చాలామంది స్థిరాస్తులు, బంగారం, షేర్ మార్కెట్లలో పెట్టుబడులు పెడతారు. కానీ, ఇంట్లో ఒకరికి అత్యంత ఖరీదైన వ్యాధి సోకినా, లేదా గృహ యజమాని అకాల మరణం చెందినా లక్షల రూపాయల కోసం ఆ ఆస్తులను కంటి ముందే తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. అప్పటివరకు ఉన్న గౌరవప్రదమైన జీవితం ఒక్కసారిగా అప్పుల ఊబిలోకి కూరుకుపోతుంది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో 'నేనున్నానంటూ' ఆర్థికంగా ఆదుకునే ఏకైక అస్త్రం, నిఖార్సైన ఇన్సూరెన్స్ మాత్రమే.

**ఎలాంటి బీమా తీసుకోవాలి? ఏది అత్యంత అవసరం?**

మార్కెట్లో వందలాది పాలసీలు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రతి బాధ్యతాయుతమైన పౌరుడు అత్యంత ప్రాధాన్యత క్రమంలో తీసుకోవాల్సిన ముఖ్యమైన బీమా రకాలు మరియు వాటి అంతరార్థాలు ఇవే:

1. ఆరోగ్య బీమా : కార్పొరేట్ వైద్య దోపిడీకి ఏకైక విరుగుడు ప్రస్తుత రోజుల్లో వైద్యం అనేది సామాన్యుడికి అందుబాటులో లేని అత్యంత ఖరీదైన వ్యాపారంగా మారింది. ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో ఎవరైనా ఆసుపత్రి పాలైతే, ఐసీయూ (×జఖ) బెడ్ ఖర్చులు, మందుల బిల్లులు చూసి గుండె ఆగినంత పనవుతుంది.వయసు చిన్నగా ఉన్నప్పుడే హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటే తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయి.

2. జీవిత బీమా : కుటుంబానికి కొండంత అండ కుటుంబానికి ఆధారం, ఆసరా అయిన వ్యక్తి అకాల మరణం చెందితే, ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడే ప్రమాదం ఉంది. మీ వార్షిక ఆదాయానికి కనీసం 10 నుండి 15 రెట్లు ఎక్కువ మొత్తానికి (ఉదాహరణకు మీ వార్షిక సంపాదన రూ. 6 లక్షలు అయితే, కనీసం రూ. 1 కోటి రూపాయల టర్మ్ పాలసీ) ఇన్సూరెన్స్ తీసుకోవడం ఉత్తమం. ఇది కేవలం మరణానంతరం కుటుంబానికి ఆర్థిక స్థిరత్వాన్ని ఇచ్చే పరమ పవిత్రమైన బీమా.

ఇంకా వీటితో పాటు 3. క్రిటికల్ ఇల్నెస్ బీమా 4. వ్యక్తిగత ప్రమాద బీమా 5. సాధారణ మరియు ఆస్తి బీమా కూడా సందర్భానుసారంగా తీసుకోవాలి.

**గ్రామీణంలో చైతన్య లోపం**

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామాలలో, వ్యవసాయ రంగంపై ఆధారపడే చిన్న, సన్నకారు రైతు కుటుంబాలలో బీమాపై అవగాహన అత్యంత అల్పంగా ఉంది. పగలు రాత్రి కష్టపడి పంట పండించే రైతుకు లేదా రోజువారీ కూలీలకు ప్రమాదం జరిగితే ఆ కుటుంబం పూర్తిగా దిక్కుతోచని స్థితిలోకి వెళ్తుంది. అందుకే గ్రామీణ ప్రజలకు, రైతులకు ప్రత్యేక రక్షణ వలయాలు అవసరం.

**ఆలోచనను ఆచరణలో పెట్టండి!**

సమస్యలు ఎప్పుడూ ముందస్తు సమాచారం ఇచ్చి రావు... కానీ బీమా రక్షణ ఉంటే ఆ సమస్యల తుఫానును తట్టుకునే ధీమా వస్తుంది. రేపు జరగబోయే 'జాతీయ బీమా అవగాహన దినోత్సవం' ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక డైరీని తెరిచి, "నా కుటుంబానికి ఉన్న రక్షణ వలయం ఎంత? ఆపద వస్తే నా భార్యాపిల్లల పరిస్థితి ఏమిటి?" అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. రేపటి చీకటి రోజులను తట్టుకోవడానికి, నేడే సరైన బీమా రక్షణ కవచాన్ని ధరించడం వివేకవంతమైన, బాధ్యతాయుతమైన పౌరుని లక్షణం. మన భవిష్యత్తుకు భరోసానిచ్చే ఈ మహా చైతన్య యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆశిద్దాం!

- కండె రమేష్
పీపుల్స్ డైరీ దినపత్రిక కరెస్పాండెంట్



## నిజాయితీ చాటుకున్న కీసర 108 సిబ్బంది

**ఈ.ఏం.టి చిత్రం రవి, పైలట్ రవితేజ**




మేడ్చల్ జూన్ 27 (పీపుల్స్ డైరీ):- ఘట్కేసర్ మండలంలోని హౌషాపూర్ గ్రామ సమీపంలో ఉన్న హెచ్ పిసిఎల్ నూతన ఫ్లైఓవర్ వద్ద పెట్రోల్ ట్యాంకర్ మరియు బైక్ ఢీకొని బైక్ పై ఉన్న వారికి తీవ్ర గాయాలు అయిన సంఘటన ఘట్కేసర్ మండల పరిధిలో చోటు చేసుకుంది, శనివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో ఉప్పల్ నుండి యాదగిరి గుట్టకు బైక్ మీద వెళ్తున్న ఇద్దరు ఒకటే కంపెనీలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్న మిత్రులకు ఈ ప్రమాదం జరిగిందని పోలీస్ వారి తెలిపారు. ఈ ప్రమాదంలో బైక్ మీద ఉన్న ఇద్దరికి పురుషోత్తం 30 సం, నవనీత 26 సం,అను ఇద్దరు సాఫ్ట్ వేర్ ఉగ్యోగులకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు, సమాచారం అందుకున్న కీసర 108 సిబ్బంది వెంటనే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన ఆ క్షతగాత్రులను అంబులెన్స్ లోకి తీసుకుని వారికి అత్యవసర వైద్య పరీక్షలు నిర్వహించి,రక్త స్రావాన్ని అరికట్టి నొప్పి నివారణ చర్యలు తీసుకొని అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి మనోధైర్యాన్ని ఇస్తూ నగరంలోని ఆసుపత్రికి తరలించారు,అలాగే వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, క్షతగాత్రుల వద్ద లభించిన బంగారపు గొలుసు (తులం) నగదు నాలుగు వేల మూడు వందల రూపాయలు, మరియు వారి మొబైల్ ఫోన్లను జాగర్తగా భద్రపరిచి, వారి కుటుంబ సభ్యులకు నిజాయితీగా అప్పగించిన కీసర 108 సిబ్బంది ఈ.ఏం.టి చిత్రం రవి, పైలట్ రవితేజ ను వారి కుటుంబ సభ్యులు అభినందించి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కలెక్టర్ మను చౌదరి ఆకస్మిక తనిఖీ

**కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఎల్ఓల పనితీరును పరిశీలించిన కలెక్టర్**



మేడ్చల్, జూన్ 27(పీపుల్స్ డైరీ):- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఎన్యూమరేషన్ ప్రక్రియను జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు.

హౌజింగ్ బోర్డు తిరుమల హిల్స్ ప్రాంతంలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్న తీరును కలెక్టర్ పరిశీలించారు. బీఎల్ఓలతో నేరుగా మాట్లాడి రోజువారీ పనితీరు, పంపిణీ చేస్తున్న ఫారాల సంఖ్య, యాప్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి అర్హ ఓటరిని గుర్తించి వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో కూకట్‌పల్లి తహసీల్దార్ అశోక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి సర్వం సిద్ధం

**జూన్ 28న పోలియో చుక్కలు వేయించాలి: డీఎంహెచ్ఓ డా. సి. ఉమా గౌరి**



మేడ్చల్, జూన్ 27(పీపుల్స్ డైరీ):- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం--2026 నిర్వహణకు అన్ని శాఖల సమన్వయంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.సి.ఉమా గౌరి తెలిపారు. జిల్లాలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. జూన్ 28 నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలోని 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి సమీపంలోని పోలియో బూత్‌లలో పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు 9 మంది జిల్లా స్థాయి అధికారులు, 120 మంది రూట్ సూపర్వైజర్లు నియమించారు. అలాగే 2,406 ఇంటింటి బృందాలు, 4,812 బూత్ వ్యాక్సినేటర్లు, 124 ట్రాన్సిట్ పాయింట్ వ్యాక్సినేటర్లు, 80 మొబైల్ టీమ్ వ్యాక్సినేటర్లు, 271 ఏఎన్ఎంలు, 1,260 ఆశా కార్యకర్తలు, 771 అంగన్‌వాడీ కార్యకర్తలు, 2,714 మంది వాలంటీర్లు సేవలందించనున్నారు. కార్యక్రమం కోసం 29,166 పోలియో వ్యాక్సిన్ వయల్స్ సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి తల్లిదండ్రులు తమ 0--5 సంవత్సరాల లోపు చిన్నారులను జూన్ 28న సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు తీసుకువెళ్లి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్ఓ డా. సి. ఉమా గౌరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కౌశిక్ విజ్ఞప్తి చేశారు.

## పౌరసత్వం పేరిట ఓటర్లను భయపెడితే సహించబోం

**డిసిసి ప్రధాన కార్యదర్శి పస్క నర్సయ్య**

ఆర్మూర్, జూన్, 27(పీపుల్స్ డైరీ) ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను సాకుగా చూపుతూ క్షేత్రస్థాయిలో సామాన్య, పేద, మైనారిటీ వర్గాల ఓటర్లను ఇబ్బందులకు గురిచేస్తే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని డిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపిపి పస్క నర్సయ్య హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను తన జేబు సంస్థలుగా మార్చుకుని, ఎన్నికల సంఘాన్ని సైతం ఒక పార్టీ శాఖలా వాడుకుంటోందని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరిట అధికారులు క్షేత్రస్థాయిలో పౌరసత్వ ఆధారాలంటూ నిరక్షరాస్యులను, వలస కూలీలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఓటు హక్కు వేరని, పౌరసత్వ నిర్ధారణ వేరని సుప్రీంకోర్టు స్పష్టమైన గైడ్‌లైన్స్ ఇచ్చినప్పటికీ, అధికారులు కఠినమైన సర్వే ఫారమ్‌ల సాకుతో ప్రజల్లో అభద్రతా భావాన్ని పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

పార్లమెంట్‌లో మెజారిటీ ఉందనే అహంకారంతో రాజ్యాంగాన్ని, సుప్రీంకోర్టు అధికారాలను కూడా పరోక్షంగా బలహీనపరిచేందుకు మోడీ ప్రభుత్వం పావులు కదుపుతోందని పస్క నర్సయ్య విమర్శించారు. నిజామాబాదు జిల్లా పరిధిలో ఎక్కడైనా ఒక్క బోగస్ ఓటును తొలగించినా పర్వాలేదు కానీ, పత్రాల సాకుతో ఏ ఒక్క పేదవాడి నిజమైన ఓటును తొలగించినా సహించేది లేదన్నారు.

బాధిత ఓటర్లకు అండగా ఉండేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతి బూత్ పరిధిలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాలు) అధికారుల సర్వేను నిరంతరం పర్యవేక్షిస్తారని, ఎక్కడైనా పక్షపాత చర్యలు కనిపిస్తే ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలెవరూ భయపడాల్సిన పనిలేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజల రాజ్యాంగ హక్కుల రక్షణకు కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు.

## ప్రజా సమస్యలను పట్టించుకోని మున్సిపల్ అధికారులను బదిలీ చేయాలి...

- మున్సిపల్ కార్యాలయం లో ప్రజా సమస్యలను పట్టించుకోకపోతే ఉద్యమాలకు దిగుతాం..
- బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి



హుస్నాబాద్, జులై 27, ( పీపుల్స్ డైరీ) : హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయానికి ప్రజలు తమ అవసరాల కోసం వస్తే రోజుల తరబడి తిప్పుకోవడం తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోని పరిష్కారం చూపడం పూర్తిగా నిర్లక్ష్యంగా మున్సిపల్ అధికారులు వ్యవరిస్తున్నారు ప్రజలు సమస్యల మీద కార్యాలయనికి వస్తే కనీసం మర్యాదగా మాట్లాడే పరిస్థితి లేదు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వలనే పట్టణం లో అక్రమ కట్టడ నిర్మాణలు జరుగుతున్నాయి అభివృద్ధి పనుల్లో భాగంగా సి సి రోడ్లు మరియు మురికి కాలువల నిర్మాణలు అంత నాణ్యతమైన పనులు జరుగతాలేవు దీని వలన ప్రభుత్వం సొమ్ము అంత వృధా అవుతుంది.అని ఆరోపిస్తున్నాం హుస్నాబాద్ పట్టణం లో అక్రమ ఇంటి నిర్మాణలు జరుగుతున్నాయి అని ప్రజలు పిర్యాదులు చేస్తే కనీసం టౌన్ ప్లానింగ్ అధికారి ఏ మాత్రం పట్టించుకోకుండా పిర్యాదుల పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు పట్టణం లో అక్రమ లే అవుట్లు వెలుస్తుంటే కనీసం వారి పై చర్యలు తీసుకునే పరిస్థితి లేదు హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ కి పట్టణ సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదు మంత్రి వర్యులకు హుస్నాబాద్ మున్సిపల్ పై పట్టింపు లేదు కాబట్టె హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయం లో అధికారుల ప్రజా సమస్యలు పరిష్కారించడం లో నిర్లక్ష్యం చేస్తున్నట్లు స్పష్టంగా కనబడుతుంది.ప్రజలకు పనిచేయని మున్సిపల్ అధికారులను వెంటనే బదిలీ చేయాలని మంత్రి ని కోరుతున్నాం మున్సిపల్ కార్యాలయం ప్రజల సమస్యల పరిష్కారం లో అధికారులు నిర్లక్ష్యం చేస్తే ప్రజా పోరాటం తప్పదు అని తెలుపుతున్నాం. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు యాస శ్రీనివాస్, బొజ్జ హరీష్, గూడ భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపెద్దమ్మ తల్లి ఆలయంలో ఘనంగా హోమం పూజలు

- పెద్దమ్మ తల్లి విగ్రహాలకు జలధివాసం..
- ఈనెల 29న పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట
- జాతరకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్న ముదిరాజ్ లు



చిగురుమామిడి,జూన్ 27(పీపుల్స్ డైరీ): చిగురుమామిడి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న జరిగే పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో ఆకవరం మఠం శివప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున హోమం కార్యక్రమాలను నిర్వహించారు.ఈ హోమం పూజల వల్ల భక్తులపై అమ్మవారి అనుగ్రహం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకంగా భావిస్తారు.అనంతరం రాత్రి పెద్దమ్మతల్లి విగ్రహాలను జలధివాసంలో భాగంగా మహిళలు పండ్లు,నీళ్లు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు.ఈ నేల 29న సోమవారం విగ్రహ ప్రతిష్ట,జులై 1న పెద్దమ్మ తల్లికి బోనాలు,జూలై 2న అమ్మవారికి ఓడి బియ్యం కార్యక్రమంతో శ్రీపెద్దమ్మ తల్లి జాతర ముగుస్తుందని అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెరుకు సంజీవ్ కుమార్,ఉపాధ్యక్షులు పొగాకుల రమేష్,కార్యదర్శి గూడ సతీష్ కుమార్,సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య,మాజీ పెద్దమనిషి పొన్నం వెంకటరాజయ్య,కార్యవర్గ సభ్యులు చెరుకు నర్సయ్య,పొన్నం బాలయ్య,పొగాకుల శ్రీకాంత్,జెట్టి సమ్మయ్య,బొల్లి రాములు,మల్లం సదానందం,ఆలయ కమిటీ సభ్యులు పొగాకుల కనకయ్య బొల్లి పరుశు రాములు,చెరుకు రాజయ్య,పొన్నం సంపత్ ,పెసరి శ్రీనివాస్ ,మల్లం సతీష్ కుమార్,మల్లం కుమారస్వామి,బొల్లి రాజయ్య,పొన్నం చిన్న మల్లయ్య,ముద్రవేణి కుమారస్వామి,చెరుకు రమేష్,పొగాకుల సదానందం, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

**జిల్లా పరిషత్ పాఠశాల తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..**



రేగొండ జూన్ 27 (పీపుల్స్ డైరీ) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శనివారం రేగొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో బయాలజీ, 9వ తరగతి విద్యార్థులతో లెక్కలు చేపించి ప్రతిభను అభినందించారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

భవిష్యత్తులో ఏం కావాలని కోరుకుంటున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకోగా, ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, సాఫ్ట్‌వేర్, ఉపాధ్యాయులుగా ఎదగాలనుకుంటున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా వారి లక్ష్యాలను కలెక్టర్ అభినందించారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజలకు సేవ చేసే అవకాశం సాధ్యమవుతుందని కలెక్టర్ తెలిపారు. చెంచుకాలని నుండి వచ్చే విద్యార్థులు సుదూరం కావడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని ప్రధానోపాధ్యాయులు తెలుపగా అట్టి విద్యార్థులకు రవాణా సౌకర్యం లేదా సైకిల్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేష్, ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ మోనిక తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..



రేగొండ జూన్ 27 (పీపుల్స్ డైరీ) : ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించే దిశగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. శనివారం రేగొండ మండల గ్రామ పంచాయతి కార్యాలయంలో మొబైల్ టిబి ఎక్స్‌రే స్క్రీనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్క్రీనింగ్ ప్రక్రియ, లక్ష్యాల సాధనను జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, రికార్డురూముతో పాటు కార్యాలయాన్ని పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకున్నందున, మరమ్మత్తులు నిర్వహణకు ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్ ను ఆదేశించారు. తదుపరి బల్క్ ల్యాండ్ సర్వే ప్రక్రియపై తహసీల్దార్ ను అడిగి తెలుసుకుని, సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దామరంచ పల్లెలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రేగొండ జూన్ 27 (పీపుల్స్ డైరీ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండలం దామరంచ పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ జిల్లెల్ల సామెల్, ఉప సర్పంచ్ మొట్టే రమాదేవి మొగిలి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మొట్టె కిరణ్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. పోచమ్మ తల్లి టెంపుల్ నుంచి మసీదు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. చాలా కాలంగా శిథిలవస్థకు చేరిన ఈ రహదారి బాగాలేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో పనులను ప్రారంభించినట్లు సర్పంచ్ జిల్లెల్ల సామెల్, గ్రామ అధ్యక్షులు మొట్టె కిరణ్ తెలిపారు. గ్రామంలో సిసి రోడ్డు పనులను ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కడపక రవి, పిఎసిఎస్ డైరెక్టర్ బోట్ల మధుసూదన్, ఐకెపి ఇంచార్జ్ బొట్ల రమేష్, సీనియర్ నాయకులు ధోనికెల సమ్మయ్య, మొట్టే ఐలయ్య, ఎండి నాసర్, బోట్ల భద్రయ్య, మొట్టే తరుణ్, మొగిలి, బొట్ల రాజు, ఇనుముల రఘుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ నాగ అనేష్**



ఏటూరు నాగారం జూన్ 27 (పీపుల్స్ డైరీ) : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే పల్స్ -పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల నియంత్రణ అధికారి డాక్టర్ నాగ అనేష్ శనివారం తెలిపారు. రాష్ట్ర అధికారులు, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాలతో ఆదివారం రోజు ఈ పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ,ములుగు జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 22,572 ఉన్నారని, 312 బూతులు, 10 ట్రాన్సిట్స్ బూతులు ,15 మొబైల్ టీం లతో ప్రణాళికలను తయారు చేసుకున్నామని వివరించారు. పోలియో వ్యాధి నివారణలో వైద్య సిబ్బందితో పాటు, ఇతర శాఖలను సమన్వయపరచుకొని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వైద్య ఆరోగ్య శాఖ తోపాటు ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యం ఉన్నప్పుడే ఈ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అవుతుందని తెలిపారు.

## మేడ్చల్ ఉమ్మడి డివిజన్‌లలో బీజేపీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమం



మేడ్చల్ జూన్ 27(పీపుల్స్ డైరీ): మేడ్చల్ ఉమ్మడి డివిజన్‌లలో బీజేపీ సీనియర్ నాయకుడు చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని ఇందులో భాగంగా మేడ్చల్, కిష్టాపూర్-పూడూర్ డివిజన్‌ల పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లలో బీఎల్‌వోలతో పాటు బీజేపీ బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి అయి తమ ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని కోరారు. బీఎల్‌వోలు అందించే రెండు పత్రాల్లో సూచించిన విధంగా వివరాలు నమోదు చేసి, ఒక ప్రతిని రసీదుగా తమ వద్ద ఉంచుకుని, మరో ప్రతిని బీఎల్‌వోలకు అందజేయాలని తెలిపారు. అనంతరం బీఎల్‌వోలు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, రతన్ రాథోడ్, వెంకటేష్ ముదిరాజ్, నర్సింగ్ రజక, పురుషోత్తం, వడ్డేపల్లి నర్సింహా కురుమ, ఒగ్గు భాస్కర్ కురుమ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్



మేడ్చల్ జూన్ 27 (పీపుల్స్ డైరీ): ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్‌కు పిలుపునిచ్చినట్లు బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ సభ్యులు గోదా అరుణ్ యాదవ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించకుండా ఎత్తివేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. పేద, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఎంతో కీలకమని, దానిని నిర్వీర్యం చేసే చర్యలను విద్యార్థి సమాజం సహించబోదని హెచ్చరించారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీల బంద్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు జిల్లా కలెక్టరేట్‌లు, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేస్తామని అరుణ్ యాదవ్ వెల్లడించారు. విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## నాయబ్ తహసిల్దార్ ను సన్మానించిన అంబేద్కర్ సంఘం నాయకులు



శంకరపట్నం జూన్:27 పీపుల్స్ డైరీ: శంకరపట్నం మండలం నాయబ్ తహసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన సాయి కృష్ణను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ రవి, మండల అధ్యక్షులు ఆరెపల్లి ఓదెల్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కనకం శంకర్, క్యాదాశి భాస్కర్, ఆడెపు నరసయ్య, అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షులు కనుకుంట్ల సాగర్, సమ్మయ్య పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
ఆదివారం, 28 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 114


# రాజ్యాధికార సమరభేరికి అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలి

**రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జింక లావణ్య**





కరీంనగర్ జూన్ 27 (పీపుల్స్ డైరీ) జూలై 05న భువనగిరిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభకు సంబంధించి పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు జింక లావణ్య కరీంనగర్‌లో కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయమల్లు ని, సంఘ సభ్యులను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా సభ లక్ష్యాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల రాజకీయ సాధికారత, సామాజిక న్యాయం మరియు బహుజన రాజ్యాధికార సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ చేస్తున్న ఉద్యమం గురించి వివరించారు.

ఈ సందర్భంగా జింక లావణ్య మాట్లాడుతూ, "బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి అభివృద్ధి కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాడుతోంది. సమాజంలోని అణగారిన వర్గాలు, కార్మికులు రాజకీయంగా బలపడినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. జూలై 05న భువనగిరిలో నిర్వహించే రాజ్యాధికార సమరభేరి సభ బహుజన వర్గాలు, కార్మికుల ఆశయాలను ప్రతిబింబించే చారిత్రాత్మక సభగా నిలవనుంది. అన్ని వర్గాల ప్రజలు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు.

మరో సందర్భంలో ఆమె మాట్లాడుతూ, "కార్మికులు దేశ అభివృద్ధికి వెన్నెముక వంటివారు. వారి సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, రాజకీయ భాగస్వామ్యం కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ కట్టుబడి ఉంది. రాజ్యాధికార సమరభేరి ద్వారా బహుజనులు, కార్మికుల స్వరాన్ని మరింత బలంగా వినిపిస్తాం. ప్రతి కార్మికుడు, ప్రతి కుటుంబం ఈ సభలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని కోరుతున్నాను" అన్నారు.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా మాట్లాడుతూ, సమాజంలోని అణగారిన వర్గాలకు రాజకీయ అధికారంలో సముచిత భాగస్వామ్యం కల్పించడమే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యమని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఐక్యతతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, మైనారిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్షత్ బిన్ అలీ, నాయకులు మహబూబ్ అలీ, సుధాల స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నూతన మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ కు సన్మానం



**ఎల్కతుర్తి జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం రోజున బీరన్న గుడి దగ్గర గ్రామ శాఖ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నూతన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ, తనకు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, స్థానిక నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా అందరినీ సమానంగా గౌరవిస్తూ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. మంత్రి పొన్నం నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటేలా ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ గొడిశాల రాజయ్య, డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, శనిగరపు వెంకటేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు గోలి రాజేశ్వరరావు, మాజీ సర్పంచులు గొడిశాల యాదగిరి, నల్లాల రాజిరెడ్డి,లోకిని సూరయ్య, బొజ్జ గోపాల్, కాంగ్రెస్ యువ నాయకుడు గొడిశాల అర్జున్ గౌడ్, కోరే పున్నం, జనగాని లక్ష్మీనారాయణ, అంబాల జగన్,గొడిశాల వినయ్, ప్రదీప్, రమేష్, వెంకట్, యువరాజ్, నాగరాజు, ముదిరాజ్ సంఘం నాయకులు, రజక సంఘం నాయకులు, యూత్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలలో విద్యార్థులు రాణించాలి : గ్రామ సర్పంచ్ బబిత

**పెరిక పల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామాగ్రి దుస్తుల పంపిణీ-**



సైదాపూర్ జూన్ 27 ( పీపుల్స్ డైరీ) : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం పెరిక పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రైమరీ పాఠశాల లో శనివారం రోజున విద్యార్థిని, విద్యార్థులకు క్రీడా సామాగ్రి దుస్తులను గ్రామ సర్పంచి పోతరాజు బబితా శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వము విద్యార్థిని విద్యార్థులకు క్రీడ సామాగ్రి తో పాటు దుస్తులను పంపిణీ చేశారు.,పాఠశాల విద్యార్థులకు అవసరమైన అనేక మౌలిక వసతులు . కల్పించి విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో రాణించి గ్రామ పేరును నిలబెట్టాలని ఆమె విద్యార్థుల నుండి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామఉప్ప సర్పంచ్ పరమేశ్వర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రతిభ లక్ష్మి, , ప్రభావతి, రమాదేవి , నీరజ, సౌజన్య, గణేష్, అంజయ్య, మురళీ మనోహర్, గ్రామస్తులు తిరుమల్ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కౌశల్ మహోత్సవ్'తో యువతకు ఉద్యోగ అవకాశాలు : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు






**హసన్ పర్తి, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన 'కౌశల్ మహోత్సవ్-2026' ద్వారా యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తెలిపారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కౌశల్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 50కి పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్న ఈ వేదిక ద్వారా 5 వేలకుపైగా ఉద్యోగ, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వేలాది మంది అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూలకు హాజరై అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులతో పాటు ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన వారు, ఇతర నైపుణ్యాలు కలిగిన యువతకు కూడా అర్హతలకు అనుగుణంగా అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు.

ఇంటర్వ్యూల్లో ఎంపిక కాని వారు నిరాశ చెందకుండా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణలను వినియోగించుకుని మరిన్ని అవకాశాలకు సిద్ధం కావాలని సూచించారు. తాను ఐపీఎస్ స్థాయికి చేరుకునేందుకు చేసిన కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం గురించి వివరిస్తూ యువతకు స్ఫూర్తినిచ్చారు.

అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు జాబ్ ఆఫర్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, కిట్స్ సిబ్బంది, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# గంగుల కమలాకర్‌ను ఆహ్వానించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు...

**బీసీ-ఎస్సీ-ఎస్టీ-మైనార్టీల రాజకీయ రాజ్యాధికారమే సమరభేరి లక్ష్యం : అఖిల్ పాషా**



**కరీంనగర్. జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బహుజన వర్గాలకు రాజకీయ రాజ్యాధికారం సాధించాలనే లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జూలై 05న నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" సభకు హాజరుకావాలని కోరుతూ కరీంనగర్ మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ఆధ్వర్యంలోని నాయకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేసింది. ఈ సందర్భంగా అఖిల్ పాషా మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు రాజకీయంగా ఇంకా పూర్తి స్థాయిలో సాధికారత పొందలేదని అన్నారు. సామాజిక న్యాయం, సమాన రాజకీయ భాగస్వామ్యం, బహుజనుల పాలన అనే లక్ష్యాలతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. జూలై 05న జరిగే సమరభేరి సభ బహుజన రాజ్యాధికార ఉద్యమానికి కొత్త దిశను చూపే చారిత్రాత్మక సభగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, మైనారిటీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్షత్ బిన్ అలీ, టౌన్ ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి ఇశ్రత్ శావాలి, నాయకులు మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ తహసీల్దార్ గణపతి రెడ్డి కుటుంబానికి 10వేల ఆర్థిక సాహాయం అందజేత



చిగురుమామిడి,జూన్ 27(పీపుల్స్ డైరీ):అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందిన విశ్రాంత తహసీల్దార్ దేవసాని గణపతి రెడ్డి కుటుంబానికి కరీంనగర్ రెవెన్యూ రిక్రియేషన్ క్లబ్ శనివారం ఆర్థిక సహాయం అందజేశారు.ఈనేల 15న గణపతి రెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబానికి అండగా నిలుస్తూ క్లబ్ తరఫున ఆయన భార్య దేవసాని సుశీలకు 10వేల రూపాయల విలువైన చెక్కును కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు.గణపతి రెడ్డి మృతికి గల కారణాలను వారి కుమారులైన దేవసాని శ్రీనివాస్ రెడ్డిని,ప్రముఖ సివిల్ కాంట్రాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ రెవెన్యూ రిక్రియేషన్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య, అసోసియేట్ అధ్యక్షుడు తాటిపల్లి ఈశ్వర్ తోపాటు పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.గణపతి రెడ్డి రెవెన్యూ శాఖలో అందించిన సేవలను ఈ సందర్భంగా అధికారులు స్మరించుకుంటూ,ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ విషయాన్ని కరీంనగర్ జిల్లా పెన్షనర్స్ ట్రస్ట్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# హుజూరాబాద్‌లో ముమ్మరంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

**పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ బైరి కిషన్, కాంగ్రెస్ నేత గడ్డం రాఘవేంద్ర**

హుజూరాబాద్, జూన్ 27, (పీపుల్స్ డైరీ) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు హుజూరాబాద్ పట్టణంలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ శనివారం ముమ్మరంగా కొనసాగింది. పట్టణంలోని 25వ వార్డు, 48వ పోలింగ్ బూత్ పరిధిలో బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బైరి కిషన్, మేనేజర్ భూపాల్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని వారు పేర్కొన్నారు.

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కమిషనర్ బైరి కిషన్ సూచించారు. ఓటర్ల జాబితాలో పేర్ల సవరణ, చిరునామా మార్పులు, కొత్తగా ఓటరు నమోదులు, అవసరమైన సవరణలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో 25వ వార్డు విద్యానగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం రాఘవేంద్ర పాల్గొని అధికారుల విధుల నిర్వహణను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## శెట్టి సుధాకర్ ను సన్మానించిన వింజపల్లి గౌడ సంఘం నాయకులు



**కోహెడ జూన్ 27 (పీపుల్ డైరీ) :** కోహెడ మండలం వింజపల్లి గ్రామంలోనీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయానికి వచ్చే భక్తులకు త్రాగు నీటి సమస్య తీవ్రంగా వున్నందున ఇట్టి విషయాన్ని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మరియు బీసీ సంక్షేమ సంఘం శాఖా మాత్యులు పొన్నం ప్రభాకర్ అన్న దృష్టికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ శెట్టి సుధాకర్ తీసుకువెళ్లగా వెంటనే ఇట్టి త్రాగు నీటి సమస్యను తీర్చేందుకు గాను బోరును మంజూరు చేయడం జరిగింది.ఇట్టి సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ నీటి సమస్యను పరిష్కరించినందుకు గాను మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు,శ్రీ వింజపల్లి రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ కు ఉండాలని రానున్న రోజుల్లో రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని అన్నారు.అదేవిధంగా మండల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా ఉన్న శెట్టి సుధాకర్ ను సన్మానం చేసి,స్వీట్ తినిపించి మరొకమారు కృతజ్ఞతలు తెలిపిన వింజపల్లి గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం హాజరైన కాంగ్రెస్ నాయకులు

**లబ్ధిదారులకు నూతన సారె చీర అందజేసిన సర్పంచ్ బబిత శ్రీనివాస్**





సైదాపూర్ జూన్ 27 ( పీపుల్స్ డైరీ) : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం పెరుకపల్లి గ్రామంలో కానుగంటి వనజ బుచ్చయ్య గార్ల ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశం కార్యక్రమంలో సర్పంచ్ పోతరాజు బబిత శ్రీనివాస్,తో సైదాపూర్ నూతన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చాడ కొండాల్ రెడ్డి,మాజీ జడ్పిటిసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య,మాజీ ఎంపీటీసీ మండల కొమురయ్య,వార్డ్ సభ్యులు కాశ వేణి రవీందర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కానుగంటి తిరుమల్ ఎఫ్ ఎ తిరుపతి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చెత్త వేసే ప్రదేశాల్లో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్



**జమ్మికుంట జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** జమ్మికుంట పట్టణ పరిధిలోని పలు వార్డులలో కాలి ప్రదేశాలలో మరియు రెండు రోడ్లు కలిసే ప్రదేశాలలో చెత్త చెదారం పడేస్తున్నటువంటి ప్రదేశాలను గుర్తించి 30వ వార్డు పి ఎ సి ఎస్ పక్కన చెత్త చెదారం వేస్తున్న ప్రదేశంలో స్థానిక వార్డు మహిళలతో కలిసి మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలో 30వ వార్డులో చెత్త తీసుకెళ్లడం కోసం ప్రతి వార్డుకు సూపర్ క్యారీ వాహనాలు మరియు మెయిన్ రోడ్డు కు ట్రాక్టర్లు తిరుగుతున్న కూడా కొందరు రోడ్డు పక్కన కాలి ప్రదేశాలలో చెత్తా వేస్తున్నారు కావున పట్టణ ప్రజలు రానున్న వర్షాకాలం దృశ్య ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చెత్త వాహనాలకు మాత్రమే చెత్త అందించి మీ చుట్టుపక్కల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే ఎలాంటి అనారోగ్యాలను గురికాకుండా ఉంటారని తెలిపారు ఈ కార్యక్రమంలో పల్లా నారాయణ, కటకం సంపత్,లెంకలపల్లి శరత్,వార్డు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులకు టీషర్ట పంపిణీ



**ఎల్కతుర్తి జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పెండ్యాల లోకేష్ తన తాతగారైన దివంగత పెండ్యాల ఎల్లయ్య జ్ఞాపకార్థంగా గ్రామంలోని డప్పు కళాకారులకు టీ షర్టను బహుకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పంజాల యాదగిరి గౌడ్ మాట్లాడుతూ పెండ్యాల ఎల్లయ్య జ్ఞాపకార్థంగా చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. యువత ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు మరింతగా చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా తమ వంతు బాధ్యతగా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దివంగత పెండ్యాల ఎల్లయ్య కుమారుడు పెండ్యాల సుదర్శన్ యువకులు డప్పు కళాకారులు తదితరులు పాల్గొని పెండ్యాల లోకేష్‌ను అభినందించారు.

## గురువు దైవంతో సమానం...!

**నిజామాబాద్ వేల్పూర్, 27 (పీపుల్స్ డైరీ)** రెవెన్యూ శివారులోని శ్రీ గోవిందసాయి దివ్య యోగాశ్రమంలో వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన గోవిందగిరి స్వామి శిష్యురాలు కూశన్నగారి శశికళ ధ్యాన మందిరంలోని పంచలోహ విగ్రహానికి, గురుపాదుకలకు గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకుడు అనురాగ్ పాండే గురుపూజోత్సవ వ్యవహర్తగా వ్యవహరించారు. గురుపాదుకాపూజ అనేది గురువు పట్ల భక్తిని, కృతజ్ఞతను మరియు వారి బోధనలను గౌరవించేందుకు నిర్వహించే ఒక పవిత్రమైన హిందూ ఆచారం. హిందూ సంప్రదాయంలో గురువుకు దైవంతో సమానమైన అంతకంటే గొప్ప స్థానం కలదు. గురువు యొక్క ప్రతీకాత్మకమైన పాదుకలను ఉంచి దీపారాధన చేసి పూలతో పూజించారు. గురుపాదుకా పూజ చేయడం వలన మనసులోని అజ్ఞానం తొలగిపోయి జ్ఞానం, వైరాగ్యం మరియు భగవత్ భక్తి అలవడుతాయి. మార్గదర్శకత్వం, స్పష్టత యొక్క మూలాన్ని చురుకుగా గుర్తించడానికి ఇది ఒక మార్గం. గురుపూజ అనంతరం భక్తులకు పంచామృత అభిషేకాలతో కూడిన తీర్థ ప్రసాదాన్ని వితరణ చేశారు.

## ఊర పండుగకు ఆహ్వానం పలికిన సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు



**నిజామాబాద్, భీంగల్,జూన్ 27 (పీపుల్స్ డైరీ)** పట్టణ సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జూలై 12 ఆదివారం రోజున నిర్వహించనున్న "ఊర పండుగ" కు హాజరు కావాలని భీంగల్ సి.ఐ. పొన్నం సత్యనారాయణ గౌడ్, స్థానిక ఎస్సై తిరుపతి, స్టేషన్ సిబ్బందిని ఆహ్వానించినట్లు సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పఠాని కృష్ణ, తీగల రఘు, కోశాధికారి ఎస్పీ భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి నిచ్చెమొల్ల రాజేశ్వర్ కమిటీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9 సంవత్సరాల అనంతరం ఘనంగా నిర్వహిస్తున్న ఊర పండుగలో పాల్గొని గ్రామదేవతల ఆశీస్సులు పొందగలరు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొదిరె నాగమణి స్వామి, వైస్ చైర్ పర్సన్ సంటి లత జే.జే. నర్సయ్య, ఒకటవ వార్డు కౌన్సిలర్ ఆరెపల్లి శ్రీజ నాగేంద్రబాబు, కౌన్సిలర్లు పర్స కుశలత అనంతరావు, తోట సతీష్, బొదిరె నరసయ్య, నీలం రవి, మలావత్ సంగ్యా నాయక్, మామరి సందీప్, మల్లెల అనుపమ ప్రసాద్, సర్వ సమాజ్ అభివృద్ధి కమిటీ సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వేల్పూర్ లో జూన్ 29న వటసావిత్రి వ్రతం

**ప్రచార ప్రతినిధి కొండ అశోక్ గౌడ్ వెల్లడి**



**నిజామాబాద్, వేల్పూర్,జూన్,27 (పీపుల్స్ డైరీ)** వేల్పూరు శివారులో గల శ్రీ సాయిబాబా దేవాలయ ప్రాంగణంలోని పంచవటి (మర్రి వృక్షం) క్రింద శ్రీ దత్తాత్రేయుని స్థానంలో నిజ జ్యేష్ఠ మాసం పౌర్ణమి జూన్ 29 సోమవారం రోజున "వటసావిత్రి వ్రతం" ఘనంగా నిర్వహించనున్నట్లు కార్యక్రమ ప్రచార ప్రతినిధి కొండ అశోక్ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొండ అశోక్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర యజ్ఞం 10 గంటలకు వట సావిత్రి వ్రత కథ, శ్రీ సత్యనారాయణ పూజ 11 గంటలకు గురుపాదుక పూజా మహోత్సవం ఉంటుంది. వట సావిత్రి వ్రతంలో పాల్గొనే వివాహిత స్త్రీలు మంగళహారతి, మామిడిపండ్లు, కొత్త రవిక, పంచపాల, రీలు దారము తమ వెంట తెచ్చుకోవాలి అని అన్నారు. కావున ఇట్టి మహత్తర కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కొండ అశోక్ గౌడ్ కోరారు.



## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రకాష్‌కు సన్మానం

**మట్టెవాడ, జూన్ 27 (పీపుల్స్ డైరీ):** వరంగల్ తూర్పు నియోజక వర్గంలోని 27వ డివిజన్ దయానంద్ కాలనీలో వరంగల్ జిల్లా గ్రంథాలయం చైర్మన్ గా నూతనంగా నియమితులైన మీసాల ప్రకాష్ ని వరంగల్ క్రిస్టియన్ సొసైటీ అధ్యక్షులు రెవ. గంధం అరుణ్ జేమ్స్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం వారి స్వగృహంలో కలిసి శాలువా కప్పి బొకే అందచేసి సత్కరించారు. అరుణ్ జేమ్స్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ గా సేవలందించి అనేక కార్యక్రమాల్లో పాల్గొని అలాగే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజల మధ్యలో ఉండే ప్రకాష్ కు కొండా మురళి - సురేఖ దంపతులు గుర్తుంచుకొని నామినేట్ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ క్రిస్టియన్ సొసైటీ సెక్రెటరీ ఎమ్మెస్ రాజు, వరంగల్ సొసైటీ ట్రెజరర్ ఎం గాబ్రియల్ పాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాల్మన్ రాజ్, వైస్ ప్రెసిడెంట్ పోలెపాక కరుణ్, శ్రావణ్, జన్ను థామస్, మడిపల్లి లేవి, అయిత ప్రవీణ్, కుమార్, పి.ప్రభుదాస్, కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, మడిపల్లి అమృత రావు, బూర సురేష్, దౌడు నాగరాజు, సర్దార్ జెస్సర్ సింగ్, బూర మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌డిసి డైరెక్టర్, సినీ నటుడు సుమన్‌కు సన్మానం



**మట్టెవాడ, జూన్ 27 (పీపుల్స్ డైరీ):** ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తరువాత తొలిసారిగా సినీ నటుడు సుమన్ వరంగల్‌కు విచ్చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన మిత్రులు సినీ నిర్మాత శ్యామల గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం కెపిఎస్ ఫంక్షన్ హాలులో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం శ్యామల గణేష్ మాట్లాడుతూ సినీ నటుడు సుమన్ ఎఫ్.డిసి డైరెక్ట్ అయిన తర్వాత మా కోరిక మేరకు మొదటిసారి వరంగల్ కు విచ్చేస్తున్న నేపథ్యంలో ఆయనను ఘనంగా సత్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోమవారం సాయంత్రం 4గంటలకు వరంగల్ శివనగర్‌లోని కెపిఎస్ ఫంక్షన్ హాలుకు నటుడు సుమన్ రానున్నారని తెలిపారు. సుమన్ మిత్రులు, అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు గణేష్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆయన అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శ్యామల గణేష్ కోరారు. ఈ సమావేశంలో పగడాల సతీష్, శ్యామల రాకేష్, రాజారెడ్డి పాల్గొన్నారు.

## ఈ నెల 28న శ్రీరామగిరిలో పల్స్ పోలియో

**ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చుక్కల మందు వేయాలి : సర్పంచ్ ప్రశాంత్**



**నెల్లికుదుర్, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఈ నెల 28వ తేదీ నుంచి శ్రీరామగిరి గ్రామంలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి సంబంధించి గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా, గ్రామంలోని వార్డుల వారీగా, తశీడాల్లోని సున్నాపువాని తండా, మంతులు తండా, వెంకటాపురంలో ఇంటింటి సర్వేల ద్వారా పోలియో చుక్కలు అందించాలని స్పష్టం చేశారు. గ్రామపంచాయతీలో పోలియో బూత్‌లలో ఆదివా రం చుక్కల మందు వేయనున్నట్లు, జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ మధ్యస్థాయి ఆరోగ్య కార్యకర్త సరిత, ఆశా కార్యకర్త సునీత, అంగన్‌వాడీ శాఖ నుండి మద్దెల కనకతార, దుంద్ర సుజాత, గాజుల ఇందిర, రేణుక పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు 22 ఆవులు మృతి



**గోవిందరావుపేట, జూన్ 27( పీపుల్స్ డైరీ) :** తాడ్వాయి మండల పరిధి అంకంపల్లి గ్రామానికి చెందిన మంకిడి సమ్మయ్య కు చెందిన 22 ఆవులు శనివారం కురిసిన భారీ వర్షానికి పిడుగుపాటుతో మృతి చెందాయి, విషయం బి ఆర్ఎస్ నాయకులు తాటి కృష్ణ, కాట్రాపురం సర్పంచ్ దిద్ది మోహన్ రావు, బీరెల్లి సర్పంచ్ విజయచంద్ర, మాజీ జెడ్పిటిసి ఫుల్ సం సరోజన, పురుషోత్తం, పోదెం కృష్ణ ప్రసాద్, పరులు పాల్గొన్నారు, పిడుగుపాటుతో మృతి చెందిన ఆవులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని పలువురు నాయకులు ప్రభుత్వాన్ని వినతి కోరారు.

## రైతు భరోసా కోసం దరఖాస్తుల స్వీకరణ



**చిట్యాల, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఈనెల 15 వ తారీకు కంటే ముందు డిజిటల్ సంతకం అయి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు రెవెన్యూ మరియు ఆర్ఓఎఫ్ఆర్ పొందిన రైతులు తమ యొక్క దరఖాస్తులు చిట్యాల రైతువేదిక నందు సమర్పించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి చిర్ర సన్నీ గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకం లేదా డిజిటల్ సంతకమైన కాపీ ఆధార్ కార్డు జిరాక్స్ బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్అప్లికేషన్ ఫామ్ జత పరచాలన్నారు. రైతుభరోసా ఇది వరకు లబ్ధి పొందుతున్న రైతులు మళ్ళీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదన్నారు. వచ్చే నెల 5 వ తారీకు చివరి గడువుగా ఉందన్నారు.

# కాలంతో పాటు కనుమరుగైపోతున్న ఆరుద్ర

**తొలకరి చినుకులకు గుర్తుగా వచ్చే ఎర్రటి మఖమల్ అతిథి ఇప్పుడు అరుదు**



**కేసముద్రం జూన్ 26 (పీపుల్స్ డైరీ) :** ఒకప్పుడు తొలకరి వాన పడగానే పొలం గట్ల వెంట, మట్టి దారిలో ఎర్రగా మెరిసిపోతూ కనిపించే ఆరుద్ర పురుగు ఇప్పుడు కనుమరుగైపోతోంది. అరచేతిలో పెడితే మఖమల్‌లా మెత్తగా అనిపించే ఈ చిన్ని జీవిని చూసి బాల్యంలో సంబరపడని వారుండరు. ఆరుద్ర కార్తెలో వాన పడ్డాక భూమి మీద నుంచి పైకి వచ్చే ఈ పురుగును చూస్తే ఏడాదంతా మంచి జరుగుతుందని మా తాతలు చెప్పేవారు" అని పెద్దలు గుర్తు చేసుకుంటున్నారు. కానీ ఇప్పుడు రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం ఎక్కువై, నేల సారం తగ్గిపోవడంతో ఈ పురుగులు కనిపించడం గగనమైపోయింది. ఒకప్పుడు పిల్లలు వీటిని అగ్గిపెట్టెల్లో దాచుకుని ఆడుకునేవారు. ఎర్రటి రంగు, మెత్తటి శరీరంతో ఆకర్షించే ఈ పురుగు తొలకరి సందడికి గుర్తు. కానీ కొత్త తరానికి ఈ పురుగు పేరే తెలియని పరిస్థితి. ప్రకృతిలో సమతుల్యత దెబ్బతినడానికి ఆరుద్ర పురుగు మాయమవ్వడం ఒక సంకేతమని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. మట్టిని కాపాడుకుంటేనే ఈ అందమైన జీవులు మళ్లీ కనిపిస్తాయని వారు సూచిస్తున్నారు.

## సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**రెగ్యులర్ విధులకు హాజరుకాని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి - ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి**

**గోవిందరావుపేట, జూన్ 27(పీపుల్స్ డైరీ) :** సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. గోవిందరావుపేట మండల కేంద్రంలో ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ఎల్. రవి మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల సమస్యలను ప్రభుత్వంనిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అనేక హాస్టళ్లలో తాగునీరు, పరిశుభ్రత, మరుగుదొడ్లు, స్నానాల గదులు, పడకలు గదులు, దుప్పట్లు, ఫ్యాన్లు, లైట్లు వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేక హాస్టల్ విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆయన అన్నారు, కొన్ని హాస్టళ్లలో వార్డెన్లు రెగ్యులర్‌గా విధులకు హాజరు కాకపోవడం వల్ల విద్యార్థుల పర్యవేక్షణ దెబ్బతింటోందని, దీనివల్ల క్రమశిక్షణతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, భద్రత కూడా ప్రమాదంలో పడుతున్నాయని పేర్కొన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తున్న వార్డెన్లపై అధికారులు వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హాస్టళ్లలో నాణ్యమైన



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆహారం అందించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, అవసరమైన స్టాఫ్‌ను నియమించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల సమస్యలను వెంటనే పరిష్క రించి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కోగిల బాలు, జిల్లా కమిటీ సభ్యులు భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు,



## ఏటూరునాగారం నూతన సిఐగా సూర్యప్రకాష్

ఏటూరు నాగారం జూన్ 27 (పీపుల్స్ డైరీ) : ఏటూరు నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న అనుమల శ్రీనివాసులు ఐజి అటాచ్కు బదిలీ చేస్తూ శ్రీనివాస్ స్థానంలో 2012 బ్యాచ్కు చెందిన జి సూర్య ప్రకాష్ ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం ఏటూరు నాగారం నూతన సిఐగా సూర్య ప్రకాష్ విధుల్లో చేరారు. సూర్య ప్రకాష్ గతంలో ములుగు జిల్లా ఇంటెలిజెన్స్ భాగంలో, భూపాలపల్లి స్పెషల్ బ్రాంచ్, వర్ధన్నపేట, గూడూరు సిఐ గా విధులను నిర్వహించి ఏటూరు నాగారం సీఐగా విధులలో చేరారు. ఈ సందర్భంగా సిఐ సూర్యప్రకాష్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని శాంతి భద్రత పరిరక్షణకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించి తమ సమస్యలను నిర్భయంగా తెలియపరచి పరిష్కరించుకోవాలని సీఐ సూర్యప్రకాష్ పేర్కొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**చిట్యాల, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** గ్రామ అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ జంపయ్య ఆధ్వర్యంలో చల్లగరిగ గ్రామంలో సీసీ రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. కర్రె నర్సింహారెడ్డి ఇంటి ముందు నుంచి కమ్యూనిటీ హాలు కూడలి వరకు ఈ రోడ్డు పనులు చేపట్టారు. శివాలయం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు భాగంలో కూడా పనులు జరుగుతున్నాయి. చాలా కాలంగా అధ్వానంగా ఉన్న ఈ రహదారి వల్ల గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త సీసీ రోడ్డు పూర్తయితే రాకపోకలు సులభంగా సాగుతాయి. ప్రజలే ముఖ్యం అభివృద్ధే మార్గం అనే నినాదంతో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తోందని సర్పంచ్ జంపయ్య అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహాయ సహకారాలతో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయగా శనివారం పనులు ప్రారంభం అయ్యాయి. ఎమ్మెల్యే సహాయ సహకారాలతో రానున్న రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు



చేపట్టనున్నట్లు తెలియజేశారు. చల్లగరిగలో సిసి రోడ్డు పనులు ప్రారంభం రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ వార్డు సభ్యులు తోట సురేష్ శత్రు నాయక్, మూల మంజుల కోడెపాక సునీత మ్యాదరి జయ దూదిపాల తిరుపతమ్మ కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల రాజిరెడ్డి బైరిశెట్టి మహేందర్ బుచ్చిరెడ్డి జయపాల్ రెడ్డి బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏ పరిధిలోని పలు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన పీవో లెనిన్ వచ్చల్ టోపో





**ఏటూరునాగారం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** కన్నాయిగూడెం మండలంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో మండలంలోని కన్నాయిగూడెం ఆశ్రమ్ హైస్కూల్, బాలుర పాఠశాల మరియు గంగుగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కన్నాయిగూడెం ఆశ్రమ్ హైస్కూల్ బాలుర పాఠశాలలో పర్యటన సందర్భంగా, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయుడితో, విద్యార్థులతో మాట్లాడి, పుస్తకాల సరఫరా విద్యార్థులకు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా అని ఆరా తీశారు. ఆర్ఓ వాటర్ ప్లాంట్ పనితీరును, బోర్‌వెల్ ద్వారా నీటి సరఫరాను తనిఖీ చేయడంతో పాటు, తరగతి గదులు, వసతి గృహాలు, సిబ్బంది గదిని కూడా పరిశీలించారు. వంటగదిలో వంట చేసే విధానాన్ని తనిఖీ చేసి, మెనూ ప్రకారం వంట చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విద్యార్థులకు సరిపడా, ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించడంతో పాటు, కిచెన్ గార్డెన్‌ను సరిగ్గా పరిశుభ్రంగా చేయాలని కూడా ఆదేశించారు. ఎస్ఎస్‌సి విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసన, పఠన సామర్థ్యాలను మరియు ప్రతిభను పరిశీలించారు. వారికి సరిపడా, ఆరోగ్యకరమైన ఆహారం, వసతి, నీటి సరఫరా, క్రీడలు మరియు ఆటల మొదలైనవి కార్యకలాపాలలో పాల్గొనడం గురించి ఆరా తీశారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను పాటించాలని, బడిబాట కార్యక్రమం కింద విద్యార్థుల హాజరును మెరుగుపరచాలని ప్రధానోపాధ్యాయుడిని మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు.
తదుపరి, గంగుగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి, సిబ్బంది, విద్యార్థుల హాజరు పట్టికను సరిచూసి, ఆ రోజు మొత్తం నమోదైన, హాజరైన వారిని పరిశీలించారు.
విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసన, పఠన సామర్థ్యాన్ని పరిశీలించి, బడిబాట కార్యక్రమం కింద విద్యార్థులను మెరుగుపరచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.



## విద్యుత్ షాక్ తోదుక్కిటెద్దు మృతి

**గోవిందరావుపేట, జూన్ 27( పీపుల్స్ డైరీ) :** తాడ్వాయి మండల పరిధి లింగాల గ్రామంలో శనివారం విద్యుత్ షాక్ తగిలి దుక్కిటెద్దు మృతి చెందింది. ఊకమల్లయ్య పొలం దున్నే మేత కోసం ఎద్దులను వదిలేసి సేద తీర్చుకుంటున్న సమయంలో విద్యుత్ స్తంభం పక్కన ఉన్న ఎర్త్ వైర్ ప్రజలు దుక్కిటేద్దు మృతి చెందడంతో సుమారు 70 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని మల్లయ్య తెలిపారు, ఎద్దు విద్యుత్ షాక్ తగిలి మృతిచెందడంతో మళ్లీ రైతు ఎద్దును కొనలేని పరిస్థితి నెలకొంది అని గ్రామస్తులు తెలిపారు, ప్రభుత్వం విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దును పరిశీలించి విద్యుత్ శాఖ నష్టపరి హారం మంజూరు చేయాలని లింగాల సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు,




## పోలియో చుక్కలు వేయించడం సామాజిక బాధ్యత

**గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మీ**

**చిట్యాల, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** పిల్ల లకు పల్స్ పోలియో చుక్కలు వేయిం చడం మనందరి సామాజిక బాధ్యత అని ఆదివారం జరుగు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చిట్యాల గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ అప్పుడే పుట్టిన వారి నుండి ఐదు సంవత్సరాల వయసు గల చిన్నారుల వరకు పల్స్ పోలియో చుక్కలు వేయించా లని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో రెండు చుక్కలు చిన్నారు లకు జీవితాంతం రక్షణ కల్పిస్తాయ న్నారు. మండల కేంద్రంలో వెంకట్రావుపల్లి సి ప్రాథమిక పాఠశాల చిట్యాల గ్రామపంచాయతీ కార్యాలయం ప్రభుత్వ ఆసుపత్రి అంబేద్కర్ చౌరస్తా పల్స్ పోలి యో కేంద్రాల నందు ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు.

## ఫిజిక్స్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



**గోవిందరావుపేట, జూన్ 27(పీపుల్స్ డైరీ) :** మండల పరిధి చల్వాయి మోడల్ స్కూల్లో ఫిజిక్స్ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉందని ప్రిన్సిపాల్ కుమార్ శనివారం తెలిపారు, 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు బోధనల కోసం ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు, జులై 3న దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహించి ఎంపికైన వారికి 4వ తేదీన నియామక ఉత్తర్వులు అందజేయడం జరుగుతుందని లెక్చరర్ కుమార్ తెలిపారు,



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ

**మొగుళ్ళపల్లి జూన్ 27(పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావును మొగుళ్ళపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల సారయ్య ఆధ్వర్యంలో. మండలంలోని జర్నలిస్టులు భూపాలపల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో. ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మల సారయ్య మొగుళ్ళపల్లిలో జర్నలిస్టుల సమస్యలతో పాటు మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవణం ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తప్పకుండా సహకరి స్తానని, ప్రెస్ క్లబ్ భవణం ఏర్పాటుకు త్వరలోనే కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు కట్కూరి ఐలయ్య, తోకల వేణు, ఉప్పుల రవి కిరణ్, పెద్దోజు దేవేందర్, క్యాతరాజు రజనీకాంత్, చింతకింది రమేష్, గుండబోయిన తిరుపతి, మంగళపల్లి శ్రీనివాస్, చర్లపల్లి వెంకటేశ్వర్లు, నాసాని విద్యాసాగర్, గుండారపు రమేష్ , బండారి రమేష్ మనోజ్, హరీష్,పాల్గొన్నారు.

## ఆలయంలో ట్రైనీ కలెక్టర్ ప్రత్యేక పూజలు



**చిట్యాల, జూన్ 27(పీపుల్స్ డైరీ) :** మండలంలోని నైన్ పాక గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ నాపాక సర్వతోభద్ర ఆలయాన్ని ట్రైనీ కలెక్టర్ నవీన్ రెడ్డి శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రభాకరాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ విశిష్టతను ట్రైని కలెక్టర్కు వివరించారు. అనంతరం నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అవసరమైన అంశాలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునేలా ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ ఏపీవో అలీమ్ ఈసీ క్యాతం సుధాకర్ ఆలయ కమిటీ చైర్మన్ యాదయ్య పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లు



**వీణవంక జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల నూతన గృహ ప్రవేశాలకు గంగాడి తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు గిరవీన రామలక్ష్మి సమ్మయ్య మంగళ హారతులతో ఘనస్వాగతం పలికారు. గంగాడి తిరుపతి రెడ్డి మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని,ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక భరోసాతో పాటు వారికి మేమున్నాం అనే ధైర్యాన్ని అందిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ గూటం సమ్మిరెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సాహెబ్ హుస్సేన్, వార్డ్ నెంబర్ కండేజ్యోతి కిషన్,మాజీ వార్డ్ నెంబర్ కండె మహేందర్, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆధునిక భారత ఆర్థిక పితామహుడు

# పీవీ నరసింహారావు

**డాక్టర్ తడికమల్ల శేఖర్**



**హుజూరాబాద్, జూన్ 28 (పీపుల్స్ డైరీ) :** స్వాతంత్ర్య సమరయోధుడు, బహుభాషా కోవిదుడు, రచయిత, రాజకీయ చాణక్యుడు, ఆధునిక భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధానమంత్రి అయిన పాములపర్తి వెంకట నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని డాక్టర్ తడికమల్ల శేఖర్ పేర్కొన్నారు. 1921 జూన్ 28న లక్నేపల్లి గ్రామంలో జన్మించిన పీవీ నరసింహారావు అనంతరం వంగర గ్రామంలో పెరిగారు. హుజూరాబాద్‌లో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించిన ఆయన, హైదరాబాద్ మరియు నాగ్‌పూర్‌లో ఉన్నత విద్యను పూర్తి చేశారు. విద్యార్థి దశ నుంచే వందేమాతరం ఉద్యమంలో పాల్గొని జాతీయ భావాలను అలవర్చుకున్నారు. సాహిత్యం పట్ల అపారమైన ఆసక్తి కలిగిన పీవీ నరసింహారావు 17 భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. కాకతీయ పత్రికకు సంపాదకత్వం వహించడమే కాకుండా అనేక రచనలు చేసి సాహిత్య రంగంలోనూ విశిష్ట కీర్తి పొందారు. రాజకీయ జీవితంలో మంథని నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన వివిధ శాఖలకు మంత్రిగా సేవలందించారు. 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి భూసంస్కరణలు, సామాజిక న్యాయానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 1991లో దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో భారతదేశ తొమ్మిదవ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. విదేశీ పెట్టుబడులకు అవకాశాలు కల్పించడం, ఆర్థిక వ్యవస్థను సరళీకరించడం, వాణిజ్య రంగంలో సంస్కరణలు చేపట్టడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు. ఐటీ, టెలికాం, బ్యాంకింగ్ రంగాల అభివృద్ధికి ఆయన హయాంలోనే బలమైన పునాదులు పడ్డాయని నిపుణులు పేర్కొంటున్నారు. విదేశాంగ విధానంలోనూ ఆయన విశేష ప్రతిభ కనబరిచి అనేక దేశాలతో సంబంధాలను బలోపేతం చేశారు. 2004 డిసెంబర్ 23న పీవీ నరసింహారావు కన్నుమూశారు. దేశానికి అందించిన విశిష్ట సేవలకు గాను 2024లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. తెలుగు జాతికి గర్వకారణమైన పీవీ నరసింహారావు దేశ ఆర్థిక సంస్కరణలకు పితామహుడిగా, దూరదృష్టి గల నాయకుడిగా భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని డాక్టర్ తడికమల్ల శేఖర్ పేర్కొన్నారు

# భూ సర్వే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి!




**గణపురం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** రైతులు భూముల సర్వే, పట్టాల జారీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం మండలంలోని బుద్ధారం గ్రామంలో తెలంగాణ భూ సర్వే సరిహద్దుల నిర్ధారణపై స్థానిక సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ... ప్రభుత్వం ఆదేశాల మేరకు భూముల సర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా నిర్వహిస్తూ,అర్హులైన ప్రతి రైతుకు పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది పట్టాదారులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించిందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని తదితర గ్రామాల్లో వేల ఎకరాల భూములకు సంబంధించి పట్టాల సమస్యలు ఉన్నాయని,వాటి పరిష్కారానికి సర్వే ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. భూమి యజమాని ప్రత్యక్షంగా హాజరు కాకపోయినా, సంబంధిత వివరాలు నమోదు చేసి సర్వే పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి,రెవెన్యూ మంత్రి మరియు జిల్లా కలెక్టర్‌తో పలుమార్లు చర్చించి ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పట్టాలు లేక రైతు భరోసా,రైతు బీమా, భూముల రిజిస్ట్రేషన్ వంటి ప్రయోజనాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సింగరేణి,సోలార్ ప్రాజెక్టులు,పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యలను కూడా సర్వే ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సర్వే ప్రక్రియ ద్వారా ప్రభుత్వ భూములు,లావాణి భూములు, సీలింగ్ భూములు తదితర భూముల వివరాలు స్పష్టంగా నమోదవుతా యని,చట్టబద్ధ హక్కులు కలిగిన వారికి పూర్తి అధికారం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులందరూ సర్వే కార్యక్రమంలో పాల్గొని తమ భూముల హక్కులను నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో భూపాలపల్లి ఆర్డిఓ హరికిషన్ నాయక్, ఎంపీడీవో భాస్కర్, ఏడి ల్యాండ్ సర్వే అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..**



**రేగొండ, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** పటిష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలు సహకరిం చాలని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. శనివారం రేగొండ మండలంలో జరుగు తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓ సుజాత ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమ రేషన్ ఫారాలు, రిజిస్టర్ లో నమోదులు, యాప్ ఎంట్రీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 2002 ఓటరు జాభితా ప్రకారం మ్యాపింగ్ చేయాల్సి ఉన్నదని తెలిపారు. బూత్ స్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తారని అందులో ఉన్న వివరాలు నమోదు చేయాలని ఓటర్లకు అవగహన కల్పించారు. బూత్ స్థాయి అధికారి వద్ద ఓటరు జాభితా ఉంటుందని ప్రతి ఒక్కరు తమ పేర్లు పరిశీలించాలని తెలిపారు. జాబితాలో పరిశీలన అలాగే అనర్హులైన వారి పేర్లను తొలగించేందుకు జరుగుతున్న ప్రత్యేక కార్యక్రమానికి సహకరించాలని ఆయన కోరారు. ఓటరు జాబితా పరిశుద్ధత ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అర్హత ఉన్న వారు తమ పేరు నమోదు చేయించుకోవడమే కాకుండా, మర ణించిన వారు, మారిన వారు వంటి అనర్హుల వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఇందుకోసం ఎన్నికల శాఖ ప్రత్యేకం గా చేపట్టిన సర్వే కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ప్రజలు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని కోరారు. అదేవిధంగా, యువత 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవా లని ఆయన పిలుపునిచ్చారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల ద్వారా నమోదు చేసుకునే సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. జిల్లాలో స్వచ్ఛమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా తయారీకి ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. పోలింగ్ కేంద్రం 223 పరిధిలో 1171 మంది ఓటర్లున్నారని వారందరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని సూచించా రు. ఎన్యూమ రేషన్ ఫారాలు ఇచ్చిన వ్యక్తులకు అక్నాలెడ్జి ఇవ్వాలని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పర్యవేక్షణ చేస్తారని ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోకు సర్వం సిద్ధం


**చిన్నారులందరికీ చుక్కలు వేయించాలి : మిట్టపల్లి సురేందర్**



**హుజూరాబాద్, జూన్ 27, (పీపుల్స్ డైరీ) :** హుజూరాబాద్ డివిజన్ పరిధిలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదేళ్లలోపు వయస్సు గల ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. తమకు సమీపంలోని పోలియో కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రభుదాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పోలియో చుక్కల పంపిణీ చేపట్టనున్నారు. ఇందుకోసం డివిజన్ వ్యాప్తంగా 180 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటుక బట్టీలు, రాతి క్వారీలు, వలస కార్మికులు నివసించే 18 సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. డివిజన్‌లో ఐదేళ్ల లోపు వయస్సు గల మొత్తం 17,472 మంది చిన్నారులను గుర్తించామని, వారందరికీ నూరు శాతం పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ప్రైవేటీకరణ టెండర్ రద్దు చేయాలి

**ఏడవ రోజుకి చేసిన ఉద్యోగుల నిరసన - నల్ల బ్యాడ్జీలతో ఆందోళన...**




**గణపురం, జున్ 27 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద నిర్వహణ విభాగాలను ప్రైవేటీకరించేందుకు చేపట్టిన టెండర్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగుల నిరసన శనివారం ఏడో రోజు కొనసాగించారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన ఉద్యోగులు కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట ఆందోళన చేపట్టి ప్రభుత్వానికి, సంస్థ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద నిర్వహణ పనులను రూ.235 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ప్రైవేట్ సంస్థకు అప్పగించేందుకు టెండర్ ప్రక్రియ చేపట్టడాన్ని ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ నిర్ణయం వల్ల శాశ్వత ఉద్యోగుల భద్రతకు ముప్పు ఏర్పడటమే కాకుండా, తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ప్రయోజనాలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఒకసారి ఈ టెండర్ అమల్లోకి వస్తే భవిష్యత్తులో ఇతర విభాగాలను కూడా దశలవారీగా ప్రైవేటీకరించే అవకాశం ఉందని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు చేపట్టడం సమంజసం కాదన్నారు. వెంటనే టెండర్‌ను రద్దు చేసి ఉద్యోగుల ఆందోళనకు ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో అన్ని యూనియన్ల నాయకులు, ఇంజనీర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని "వైటీపీఎస్‌ను కాపాడండి.. ప్రైవేటీకరణను నిలిపివేయండి", "ప్రభుత్వ రంగాన్ని పరిరక్షించాలి" అంటూ నినాదాలు చేశారు.

# తనిఖీలు చేస్తుండగా పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగ

**చోరీలు చేసేది తండ్రి కొడుకులే**

**నిందితుడిపై 42 కేసులకు పైగా ఇంటి చోరీలు**

**పరారిలో ఉన్న చోరుల కోసం ప్రత్యేక గాలింపు**

**ఎస్ఐ సురేష్‌ను అభినందించిన సీఐ మల్లేష్**



**మొగుళ్ళపల్లి, జూన్ 27( పీపుల్స్ డైరీ):** మండలంలో అంతర్రాష్ట్ర దొంగను పట్టుకున్నట్లు చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ డి మల్లేష్ యాదవ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో జరిగిన సమావేశంలో చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఘటనకు సంబంధించి వివరాలు తెలియజేశారు. మొగుళ్ళపల్లి మండలంలోని పాత ఇస్సిపేట గ్రామ శివారులో మొగుళ్ళపల్లి ఎస్సై ముప్పు సురేష్ వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనదారుడు తనిఖీ చేస్తున్న ఎస్సై ని చూసి పారిపోతున్న క్రమంలో. ఎస్సై చాకచక్యంగా వాహనదారున్ని వెంబడించి పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. తీగ లాగితే డొంక కదిలినట్లు తండ్రి కొడుకులే అసలు దొంగలని, పట్టుబడిన దొంగను విచారిస్తే తెలిసింది. మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్లపల్లి గ్రామంలో 29మార్చి 2026న ఇంటి తాళాలు పగులగొట్టి, మోటార్ సైకిల్ దొంగతనం చేసిన దొంగగా అతనిని గుర్తించారు. మహబూబాద్ జిల్లా నెల్లుకుదురు మండలం, మునుగలవీడు గ్రామానికి చెందిన దాసరి మురళీకృష్ణ(30) దొంగగా గుర్తించడం జరిగిందని పర్లపల్లి లో మూడు చోట్ల చోరీ జరిగిన ఘటనలో దాసరి మురళీకృష్ణ తో పాటు తన తండ్రి దాసరి నరసయ్య(ఏ2) తన సోదరుడు దాసరి గణేష్(ఏ3) తో కలిసి మూడు చోట్ల చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. చోరీలో ద్విచక్ర వాహనం(బజాజ్ పల్సర్ 150) 5వేల రూపాయల నగదు బంగారు వెండి ఆభరణాలను అపహరించి చోరీచేసిన ఆహారం ఆభరణాలను విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసినట్లు తెలిపాడని నిందితుడు వద్ద నుండి చోరీకి గురైన బజాజ్ పల్సర్ 150 సిసి ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడుపై 42 కు పైగా ఇంటి చోరి కేసుల్లో నిందితుడుగా నేరపూరిత ప్రవర్తన కలిగి పదేపదే చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగగా గుర్తించారు. పట్టుబడిన దొంగతో పాటు పరారిలో ఉన్న నిందితులు దాసరి నర్సయ్య, దాసరి గణేష్ లను అరెస్ట్ చేసేందుకు చిట్యాల సిఐ పర్యవేక్షణలో. పోలీసులు ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. చాకచక్యంగా దొంగను వెంటాడి పట్టుకుని కేసును చెధించినందుకు ఎస్ ఐ. ముప్పు సురేష్, పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. ఎస్ ఐ. మాట్లాడుతూ. మండల ప్రజలు రాత్రి వేళల్లో ఇళ్లకు బలమైన తాళాలు వేయడంతో పాటు విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112 సమాచారం అందించాలని మొగుళ్ళపల్లి ఎస్సై సురేష్ తెలిపారు.

## విత్తనోత్పత్తిలో తగిన జాగ్రత్తలు పాటించాలి



**కరకగూడెం, జూన్ 27(పీపుల్స్ డైరీ) :** మండలంలోని రైతులు విత్తనోత్పత్తి కార్యక్రమంలో పాల్గొనే ముందు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. విత్తనోత్పత్తి చేపట్టే రైతులు తప్పనిసరిగా విత్తన కంపెనీతో లిఖితపూర్వక ఒప్పందం చేసుకోవాలి. ఒప్పందంలో రైతు పేరు, సర్వే నంబర్, విస్తీర్ణం, పంట రకం, విత్తన రకం, కొనుగోలు ధర లేదా ధర నిర్ణయ విధానం, నాణ్యత ప్రమాణాలు, చెల్లింపు విధానం, కంపెనీ మరియు రైతు బాధ్యతలు స్పష్టంగా పేర్కొనబడాలి. ఒప్పందాన్ని గ్రామ పెద్దలు లేదా గ్రామ ప్రజాప్రతినిధుల సమక్షంలో చేసుకోవడం మంచిది. కంపెనీ నుండి విత్తనాలు తీసుకున్నప్పుడు తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు తీసుకొని భద్రపరచుకోవాలి. కంపెనీ ప్రతినిధులు వ్యక్తిగతంగా తెలిసిన వారైనా మౌఖిక హామీలను నమ్మకుండా అన్ని షరతులను ఒప్పంద పత్రంలో నమోదు చేయించుకోవాలి. ఖాళీ పత్రాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ సంతకం చేయరాదు. విత్తనోత్పత్తి ప్రారంభించే ముందు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారికి సమాచారం అందించాలి.

## రాజలింగాలలో ముందస్తు పారిశుధ్య చర్యలు



**ఏన్కూరు జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రాజలింగాల గ్రామంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ లిధనసరి నవీన్‌లి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలోని సైడ్ డ్రైనేజీలను, రోడ్ల పక్కన పిచ్చిగా పెరిగిన ముళ్ల పొదలను జేసీబీ సహాయంతో పూర్తిస్థాయిలో శుభ్రం చేయించారు. వర్షపు నీరు నిలిచిపోకుం డా, దోమల వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఈ పారిశుధ్య పనులను చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుం డా ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవా లని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## డయల్ యువర్ ఇల్లందు ఎమ్మెల్యేకు విశేష స్పందన



**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం), జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఇల్లందు నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో నిర్వహించిన "డయల్ యువర్ ఇల్లందు ఎమ్మెల్యే" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గంటపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 158 ఫోన్ కాల్స్ వచ్చాయి. వాటిలో 40 మంది ప్రజలతో ఎమ్మెల్యే కోరం కనకయ్య నేరుగా మాట్లాడి, వారి సమస్యలు, వినతులు, సూచనలు తెలుసుకున్నారు. ప్రజలు వివరించిన సమస్యలపై వెంటనే సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి లభించిన విశేష స్పందన పట్ల ఎమ్మెల్యే కోరం కనకయ్య హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించి ప్రజలకు మరింత చేరువగా ఉంటామని పేర్కొన్నారు.

## డీ-అడిక్షన్ కేంద్రాలకు క్యారమ్ బోర్డు అందజేత




**ఖమ్మం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసైన వారికి కౌన్సెలింగ్‌తో పాటు ఇండోర్ క్రీడలు ఎంతో అవసరమని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్‌లో వున్న డీ-అడిక్షన్/పునరావాస కేంద్రంలో కౌన్సిలింగ్ పొందుతున్న బాధితులకు మానసిక ఉల్లాసం కోసం ప్రభుత్వం అందజేసిన క్యారామ్ బోర్డును పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు టౌన్ ఏసీపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, బాధితుల పునరావాసం కోసం రాష్ట్ర ప్రభుత్వం డీ-అడిక్షన్ కేంద్రాలకు క్యారామ్ బోర్డులు, ఇండోర్ గేమ్స్‌ను పంపిణీ చేస్తున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిఆర్బీ ఏసీపీ సాంబరాజు, ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, వైద్యులు, కౌన్సిలింగ్ బృందం పాల్గొన్నారు.

## మాలల మహా ర్యాలీని విజయవంతం చేయాలి

**జిల్లా ఇంచార్జ్ దామాల సత్యం, అల్లాడి పాలరాజ్**



**భద్రాద్రికొత్తగూడెం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** భద్రాచలం మాలమానాడు యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో జూలై 12న భద్రాచలంలో నిర్వహించనున్న మాలల మహా ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాలమానాడు నాయకులు దామాల సత్యం, పౌల్రాజ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని విమర్శించారు. మాలల ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, అదే మాలల హక్కులు, అవకాశాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాబట్టి మాల సమాజం అంతా ఐక్యంగా ముందుకు వచ్చి, జూలై 12న భద్రాచలంలో నిర్వహించనున్న మాలల మహా ర్యాలీ, మహాసంగ్రామాన్ని విజయవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాలమానాడు యూనిట్ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్‌రాజ్, జిల్లా నాయకులు బుయ్యన వీరబాబు, పోలవరం మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కురినాల వెంకటేశ్వర్లు, పోలవరం జిల్లా కార్యదర్శి వరదా బ్రహ్మం, రిటైర్డ్ అధికారి నూకబోయిన నర్సింహా, కార్యదర్శి వరదా సాయి, తదితరులున్నారు.

# సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమే

## సీపీఐ(ఎం) వైరా డివిజన్ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం

**ఏన్కూరు, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని, ప్రపంచ దేశాలకు శత్రువు సామ్రాజ్యవాదమేనని, గ్లోబలైజేషన్ విఫలమైందని లోకలైజేషన్ ప్రారంభమైందని, ప్రజా సమస్యలను అధ్యయనం చేసి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని, ప్రపంచ అభివృద్ధికి సామ్రాజ్యవాద శక్తులే నేడు అతిపెద్ద ప్రమాదంగా మారాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామంలోని మోతుకూరి గార్డెన్స్ పంక్షన్ హాల్ నందు సిపిఐ(ఎం) వైరా డివిజన్ రాజకీయ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు గుండాల సత్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ రాజకీయ తరగతులకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా తిమ్మారావుపేట సర్పంచ్ గుగులోత్ సుమలతను శాలువా కప్పి నున్నా నాగేశ్వరరావు అభినందించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు క్లాసులను ప్రారంభించి "జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు" అంశంపై మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దాని నుంచి బయటపడేందుకు అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవా ద దేశాలు యుద్ధాలు, ఆర్థిక ఆంక్షలు, ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యాన్ని పెంచుతున్నాయని అన్నారు. ఈ పరిణామాలు ప్రపంచ శాంతికి తీవ్ర ముప్పుగా మారాయని పేర్కొన్నారు. భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని, కార్మిక చట్టాలను బలహీనపరు స్తోందని, వ్యవసాయ



రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే చర్యలు చేపడుతోందని విమర్శించారు. దీనివల్ల కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, మహిళలపై ఆర్థిక భారం పెరుగుతోందన్నారు. ప్రజల అసలు సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు మతోన్మాదం, కులవివక్ష, ద్వేష రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని, రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలు రాజకీయంగా, సైద్ధాంతికంగా మరింత చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చా రు. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషిస్తూ ప్రజా సమస్యలపై ఉద్యమాలను నిర్మించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు... పార్టీ నిర్మాణం, ప్రజా సంఘాల బలోపేతం, కార్మిక-రైతు ఐక్య త సాధనలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. సాయంత్రం పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు పి. సోమయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి నిరంతరం ఉద్యమాలు చేపట్టాల ని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలిచ్చి రెండున్నరేండ్లు గడిచినప్పటికీ, వాటిని అమలు చేయడం లేదని విమర్శించారు. దేశంలో ఉపాధి, ఉద్యోగావకాశాలు లేక పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరోపక్క నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నా.. పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో విసిగిన ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, కానీ ఒక్క హామీని అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను గుర్తించి ప్రజలను చైతన్యవంతం చేసి దశల వారీగా ఉద్యమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, ఏన్కూరు, కొణిజర్ల, సింగరేణి, వైరా రూరల్, కామేపల్లి మండలాల కార్యదర్శులు దొంతెబోయిన నాగేశ్వర రావు, చెరుకుమల్లి కుటుంబరావు, కుందనపల్లి నరెంద్ర, బాణాల శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరెడ్డి తిమ్మరావుపేట గ్రామం సర్పంచ్ గుగులోత్ సుమలత, పార్టీ నాయకులు ఏల్పుల రాములు, ఇటికల లెనిన్, కాలసాని సాయి, రేగళ్ళ తిరుమలరావు, షేక్ జానీ, కాత్రేల బిక్షం, భూక్యా లచ్చు, డివిజన్ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన మొహరం వేడుకలు

**ఏన్కూరు, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఏన్కూరు మండలంలోని గార్ల ఒడ్డు, రేపల్లెవాడ, లింగన్నపేట, జన్నారం, రాజలింగాల గ్రామాల్లో మొహర్రం (పీర్ల పండుగ) వేడుకలు భక్తిశ్రద్ధలు, సాంప్రదాయ బద్ధంగా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. గత పది రోజులుగా గ్రామాల్లోని పీర్ల చావిడీల వద్ద భక్తులు సమర్పించిన ప్రత్యేక ప్రార్థనలు, మొక్కులతో పల్లెల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. చివరి రోజున పీర్ల ఊరేగింపు ఘనంగా జరిపారు.

### గంగప్రవాహంలో పీర్ల నిమజ్జనం

పండుగ చివరి రోజైన తడి రోజున గ్రామాల్లోని పీర్లను ఊరేగిస్తూ స్థానిక చెరువులు, కుంటలు లేదా బావుల వద్దకు తరలించారు. భక్తులు 'హుస్సేన్.. దూలా..' అంటూ చేసిన నినాదాల మధ్య పీర్లను గంగప్రవాహంలో నిమజ్జనం (సవార్లను చల్లబరచడం) చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు,పిల్లలు,పెద్దలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల మాఫియా బారిన ఆదివాసీ రైతులు..



**కరకగూడెం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో నకిలీ విత్తనాల పేరుతో ఆదివాసీ రైతులను మోసం చేసి తీవ్ర ఆర్థిక నష్టాలకు గురిచేశారని బాధిత రైతులు వ్యవసాయ శాఖ అధికారి ఏ,వో సెటర్జి వారికి వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా జేఏసీ ఆదివాసి మండల అధ్యక్షులు, గొగ్గల కృష్ణ మాట్లాడుతూ . భూబదలాయింపు నిషేధ చట్టాలు 1/59, 1/70తో పాటు పీసా (రాజుఙూూ) చట్టం వ్యవసాయ శాఖ ఉన్న ఈ ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలు చట్టబద్ధంగా సాగాల్సి ఉండగా, కొందరు కంపెనీలు అమాయక ఆదివాసీ రైతులను లక్ష్యంగా చేసుకుని తప్పుడు హామీలతో విత్తనాల వ్యాపారం నిర్వహించాయని పేర్కొన్నారు. రైతులకు ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని నమ్మించి విత్తనాలు విక్రయించారని తెలిపారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి ఎకరానికి కేవలం 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే రావడంతో భారీ నష్టాలు వాటిల్లాయని వాపోయారు. నారు పోసి, దమ్ము చేసి, కొంతభాగంలో నాట్లు వేసిన అనంతరం కంపెనీ ప్రతినిధులు విత్తనాల సరఫరా నిలిపివేశారని, సమయం దాటిపోవడంతో మిగిలిన పొలాల్లో నాట్లు వేయలేక మరోసారి నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పంటలకు బీమా సౌకర్యం కల్పించకపోవడంతో పూర్తిగా అప్పుల పాలయ్యామని తెలిపారు. ఈ వ్యవహారంలో సంబంధిత కంపెనీల నిర్వాహకులు, నిర్వాహక ప్రతినిధులు, అలాగే కరకగూడెం మండలం అనంతారం గ్రామానికి చెందిన డీలర్ కొమ్మ శివ (శంకరయ్య కుమారుడు)పై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన ఆదివాసీ రైతులకు తక్షణ పరిహారం, పంట నష్టపరిహారం, భూముల రక్షణతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని,వ్యవసాయ శాఖ జిల్లా అధికారులను బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

## పట్టుబడిన గంజాయి దహనం

**ఖమ్మం,జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన, సీజ్ చేసిన సుమారు 3 కోట్ల 43 లక్షల విలువ చేసే 687.409 కిలోల ఎండు గంజాయిని కోర్టు ఆదేశాల మేరకు శాస్త్రీయ పద్ధతిలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పర్యవేక్షణలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ, సిసిఆర్బీ ఏసీపీ సాంబరాజు శనివారం తల్లాడ మండలం గోపాల్‌పేటలోని ఏడబ్ల్యూఎం కన్సల్టెన్సీ లిమిటెడ్‌లో దహనం చేశారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన 29 కేసుల్లో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలు జరిపిన నేరస్థులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గెజిట్ నోటిఫికేషన్ల ఆధారంగా పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు నిబంధనలు అనుగుణంగా ఈ దహనం జరిగిందని టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ ఏసీపీ మాట్లాడుతూ... జిల్లాలో



గంజాయి సాగు చేసినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐ సర్వయ్య, ఇన్స్పెక్టర్ మోహన్ బాబు పాల్గొన్నారు.

# చినుకుల సాక్షిగా.. ప్రగతి అడుగులు!

## వర్షపు జల్లుల మధ్యే కూసుమంచి మండలంలో రూ. 16.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేసిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా.. వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా... వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ.16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ... వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. వానలు పడుతున్నా ప్రజల కోసం ప్రగతి పనులు ఆపబోమని, అధికారులు కూడా అంతే వేగంతో నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.



### రూ. 16.13 కోట్లతో శంకుస్థాపనలు..

మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోళ్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు - ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ.4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల



అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో పీరీల ఊరేగింపు

## కరకగూడెంలో మిన్నంటిన మొహర్రం సంబరాలు

**కరకగూడెం, జూన్ 28,(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగాయి. హిందూ, ముస్లింలు అనే తేడా లేకుండా కులమతాలకు అతీతంగా స్థానిక ప్రజలందరూ ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని తమ లౌకికత్వాన్ని, మతసామరస్యాన్ని ఘనంగా చాటుకున్నారు. గ్రామంలో ప్రతిష్టించిన పీరీలను రంగురంగుల వస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి, డప్పు వాయిద్యాల మోతలు, యువకుల కోలాటాలు, సాంప్రదాయ నృత్యాల మధ్య పురవీధుల గుండా వైభవంగా ఊరేగించారు. ఊరేగింపు సాగుతున్నంత సేపూ భక్తులు పీరీలకు 'సవావా' (మొక్కుబడులు) చెల్లించుకుంటూ, చక్కెర మరియు బెల్లం ప్రసాదాలను సమర్పించారు. ముస్లిం సోదరులతో పాటు హిందువులు కూడా పీరీలను భుజాలపై మోస్తూ, అలాయ్ బలాయ్ తీసుకుంటూ సోదరభావాన్ని పెంపొందించుకున్నారు. ఈ పీరీల పండుగ కేవలం ఒక వర్గానికి సంబంధించినది కాకుండా, ఊరంతా కలిసికట్టుగా ఒకే తాటిపై చేసుకునే పండుగలా సాగడం ఇక్కడి ప్రత్యేకతను సంతరించుకుంది.






# ఘనంగా 'హిందూ సామ్రాజ్య దివస్'

### శివాజీ మహారాజ్ చిత్రపటానికి ఘన నివాళులు

**ఏన్కూర్, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా ఏన్కూర్ మండల కేంద్రంలో శనివారం 'హిందూ సామ్రాజ్య దివస్' వేడుకలను హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి కమిటీ సభ్యులు, స్థానిక యువకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతదేశ చరిత్రలో శివాజీ మహారాజ్ సాధించిన విజయాలను, ఆయన చూపిన శౌర్య పరాక్రమాలను ఈ సందర్భంగా నిర్వాహకులు స్మరించుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల గుండా హిందూ సేవా సమితి కార్యకర్తలు, యువకులు భారీ ర్యాలీ నిర్వహించారు. 'ఛత్రపతి శివాజీ మహారాజ్ కీ జై', 'భారత్ మాతా కీ జై' అంటూ కార్యకర్తలు చేసిన జాతీయవాద నినాదాలతో ఏన్కూర్ పురవీధులు మారుమోగాయి. హిందూ సామ్రాజ్య స్థాపనలో శివాజీ మహారాజ్ పాత్రను నేటి తరానికి చాటిచెప్పేలా సాగిన ఈ ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హిందూ సేవా సమితి ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, ఉత్సాహవంతులైన కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక యువకులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్పయాత్ర పోస్టర్లు ఆవిష్కరణ



**ఖమ్మం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఖమ్మం మయూరి సెంటర్ అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప యాత్ర ను కేకే కమిటీని ఏర్పాటు చేసినందుకు గాను ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుత్తూ... తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిష్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో 101 కార్లతో శ్రీ జోగులాంబ పుణ్య క్షేత్రానికి (టియుఎఫ్) తెలంగాణ ఉద్యమకారుల విజయ సంకల్ప యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిష్టర్డ్ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పసుపులేటి నాసరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిష్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.వి కృష్ణారావు మాట్లాడుతూ... ఈనెల 29వ తారీకు సోమవారం నాడు చేపట్టిన సంకల్ప యాత్రకు తెలంగాణ నలుమూల నుంచి కార్లతో బయలుదేరి తెలంగాణ ఉద్యమకారులందరూ పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో పగడాల నరేందర్, బచ్చుల పద్మాచారి, లింగనబోయిన సతీశ్, కేలోత్ రవిచంద్ర చౌహాన్, మేలవెల్లి వెంకటేశ్వరరావు, రెడ్డే బోయిన వరలక్ష్మి, గాజుల రవి కుమార్, భుక్య శ్రీనివాస్ నాయక్, వసీం ఖాన్, బురాన్, ఆసిఫ్, అల్లిక సంతోష్ యాదవ్, దొడ్డ శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్, వేముల సతీష్, స్వరూప రెడ్డి, కమలమ్మ, ధనలక్ష్మి, యక లక్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటర్‌కు ఎన్యుమారేషన్ ఫారం అందించాలి



**నర్సంపేట, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) పట్టణంలోని 26వ వార్డు పరిధిలోని 148, 149 బూతుల కు సంబంధించిన బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తున్నారు అందులో భాగంగా స్థానిక కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ గార్లకు ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్ఓ ఎన్.అనురాధ అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరుకు పారాలు అందించాలని ఓటర్ వివరాలు సేకరించాలని ఈ సందర్భంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటరు ఎన్యుమరేషన్ ఫారం తొందరగా పూర్తి చేయిస్తూ తిరిగి మీకు అందించే విధంగా జరగాలని తెలిపారు.

## నూతన తహసీల్దార్‌కు ఘన స్వాగతం



**వీణవంక, జూన్ 27( పీపుల్స్ డైరీ) :** మండలానికి నూతన తహసీల్దార్‌గా నియమితులైన ముద్దసాని రమేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనస్వాగతం పలికిన పత్తి వేణుగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా మండల ప్రజలకు పారదర్శకమైన, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే పరిపాలన అందించాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మండల నూతన తహసిల్దార్ హామీ ఇచ్చారు.

# జూనియర్ అడ్వకేట్ల సంక్షేమమే లక్ష్యం

## సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలను స్వాగతించిన ఎఫ్ఎల్‌పీసీ

**ఖమ్మం, జూన్ 27 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలోని జూనియర్ అడ్వకేట్ల సంక్షేమం, వృత్తి భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం సమగ్ర సంక్షేమ విధానాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ (ఎఫ్ఎల్ పిసి) డిమాండ్ చేసింది. జూనియర్ అడ్వకేట్లకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, నెలవారీ స్టైపెండ్, తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ కార్పస్ ఫండ్ ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఖమ్మం నగరంలోని ద్వారకానగర్ లయన్స్ క్లబ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జూనియర్ అడ్వకేట్ల సంక్షేమ అవగాహన కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్ చౌదరి అధ్యక్షత వహించగా, ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు సమన్వయం చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బిచ్చల తిరుమలరావు, మామిడి హనుమంతరావు, ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ యడ్లపల్లి రమేష్, అడ్వకేట్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు, తన్నీరు లలిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాళ్లూరి దిలీప్ చౌదరి మాట్లాడుతూ... 2019 తర్వాత బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న జూనియర్ అడ్వకేట్లందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు, ఐదేళ్లలోపు ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ అడ్వకేట్లకు నెలవారీ స్టైపెండ్, అలాగే తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ కార్పస్ ఫండ్ ఏర్పాటు కోసం ప్రభుత్వం దృష్టికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అడ్వకేట్ల సంక్షేమాన్ని శాశ్వతంగా బలోపేతం చేయాలంటే కార్పస్ ఫండ్ ఏర్పాటు అత్యంత అవసరమని



పేర్కొన్నారు. ఈ సందర్భంగా డబల్యు.పి.(సివిల్) నెం.770/2026-- సారిక ట్యాగీ వాసెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం జారీ చేసిన చారిత్రాత్మక మధ్యంతర ఆదేశాలను ఫెడరేషన్ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. ముఖ్యంగా యంగ్ అడ్వకేట్స్ ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫండ్, మహిళా అడ్వకేట్లకు ప్రత్యేక మౌలిక వసతులు, బార్ అసోసియేషన్లలో ప్రాథమిక సౌకర్యాల కల్పన, అడ్వకేట్ల సంక్షేమ చర్యలను బలోపేతం చేయడం వంటి అంశాలపై సుప్రీంకోర్టు చేసిన సూచనలు దేశవ్యాప్తంగా న్యాయవాదులకు ఎంతో మేలు చేస్తాయని అభిప్రాయపడ్డారు. "మేము చాలా కాలంగా ప్రభుత్వం ముందు ఉంచుతున్న అంశాలనే నేడు సుప్రీంకోర్టు కూడా ప్రస్తావించడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. అడ్వకేట్ల సంక్షేమం కోసం మా పోరాటం మరింత బలోపేతంగా కొనసాగుతుంది" అని తాళ్లూరి దిలీప్ చౌదరి తెలిపారు. సీనియర్ న్యాయవాది మామిడి హనుమంతరావు ఈ-ఫైలింగ్ విధానం, సర్టిఫికేట్ ఆఫ్ వెరిఫికేషన్ రూల్స్--2015పై సమగ్ర అవగాహన కల్పించగా, కొత్త వెంకటేశ్వరరావు అడ్వకేట్స్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యత్వం, దాని ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు. జేఏసీ ఛైర్మన్ బిచ్చల తిరుమలరావు మాట్లాడుతూ... 2019 తర్వాత నమోదు అయిన ప్రతి జూనియర్ అడ్వకేట్‌కు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు అందే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. పెద్ద సంఖ్యలో జూనియర్ అడ్వకేట్లు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని వారు అభినందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కోరారు. అడ్వకేట్ల సంక్షేమం, వృత్తిభివృద్ధి, ఆర్థిక భద్రత కోసం ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

# ఓటరు జాబితా ప్రక్షాళనలో అప్రమత్తత అవసరం: ఆంటోనీరెడ్డి


**హుజూరాబాద్, జూన్ 27, (పీపుల్స్ డైరీ) :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బీజేపీ శ్రేణులు అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ జిల్లాలోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహించిన బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశాలకు రాష్ట్ర పరిశీలకుడిగా హాజరైన ఆయన, ఎస్ఐఆర్ నిర్వహణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంటోనీ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. ఓటరు నమోదు, చిరునామా మార్పులు, తప్పుల సవరణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతి, యువకుడు ఓటరుగా



నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని, ప్రజాస్వామ్య బలోపేతంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి నిర్వహించే ధృవీకరణ ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు నిరంతరం నిఘా ఉంచాలని, అర్హులైన ఓటర్లు జాబితా నుంచి తొలగించబడకుండా చూడాలని సూచించారు. ఓటరు జాబితాలో లోపాలు లేకుండా చూడటం పార్టీ విజయానికి మొదటి మెట్టుగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా జరిగితేనే ప్రజాస్వామ్యయుత ఎన్నికలకు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుప్పాల రఘు, జిల్లా కార్యదర్శి నరసింహరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గుర్రాల నిర్మల రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, హుజూరాబాద్ నియోజకవర్గ నాయకులు తూర్పాటి రాజు, కొండల్ రెడ్డి, కొలగాని రాజు, బైరెడ్డి రమణారెడ్డి, రమేష్, బత్తిని నరేష్, ర్యాకం శ్రీనివాస్, వొడ్నాల విజయ్, నీలం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# యాద్గార్‌పల్లిలో సర్ ప్రక్రియను పరిశీలించిన అదనపు కలెక్టర్


**మేడ్చల్, జూన్ 27(పీపుల్స్ డైరీ):** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమని, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అధికారులు నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సూచించారు. శనివారం కీసర మండలంలోని యాద్గార్‌పల్లిలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి బీఎల్‌ఓలు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ తీరును పరిశీలించి, ఒక్కో కుటుంబానికి ఎన్ని పత్రాలు అందజేస్తున్నారు, వివరాలను ఎలా నమోదు చేస్తున్నారు అనే అంశాలపై బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఓటరికి రెండు ఎన్యూమరేషన్ పత్రాలు అందజేస్తున్నామని, సెల్‌ఫోన్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా వివరాలను ఎన్యూమరేషన్ యాప్‌లో నమోదు చేసి అప్‌లోడ్ చేస్తున్నామని వివరించారు. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, పత్రాల పంపిణీ పూర్తయిన వెంటనే సంబంధిత వివరాలను తప్పనిసరిగా



యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఇంటికి చేరుకుని పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర తహసీల్దార్ యాదగిరి రెడ్డి, ఆర్ఐ మహేందర్, బీఎల్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

**మేడ్చల్, జూన్ 27(పీపుల్స్ డైరీ):-** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అప్పమ్మ గారి జగన్ రెడ్డి ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారంగా రూ.51 వేల విరాళాన్ని అందజేశారు. శనివారం నిర్వహించిన ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి హాజరైన జగన్ రెడ్డి, ఉత్సవ కమిటీ నిర్వాహకులకు రూ.51 వేల నగదును అందించి ఆలయ అభివృద్ధికి మద్దతు ప్రకటించారు. ఆయన సేవాభావాన్ని స్థానికులు, ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా జగన్ రెడ్డి మాట్లాడు తూ, గ్రామాల్లో ఆలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం నిర్మాణం గ్రామానికి మరింత ఆధ్యాత్మిక శోభను తీసుకువస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఆలయాన్ని సందర్శిస్తూ భక్తి భావాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఆధ్యాత్మికత ద్వారా మనశ్శాంతి, ఆత్మసంతృప్తిని పొందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com